RNI No.TELTEL/2016/68720

ప్రజలకోసం పోలీస్

# పోలీస్ నిఘా
# POLICE NIGAH

తెలుగు దినపత్రిక

Published from Rangareddy, (Circulated) by Hyderabad, Rangareddy, Nalgonda, Mahabubnagar, Sangareddy, Vikarabad, Medak, Siddipet, Karimnagar, Sirisilla(Vemulawada), Nizamabad, Warangal, Yadadri Bhonagiri, Nirmal, Adilabad

రంగారెడ్డి | సంపుటి: 10 | సంచిక: 168 | ఎడిటర్: కేమోజు శ్రీనివాస్ | శనివారం 21-03-2026 | వెల: రూ.5/- | పేజీలు: 8

పోలీస్ నిఘా POLICE NIGAH తెలుగు దిన & మాస పత్రిక


పోలీస్ నిఘా POLICE NIGAH Web NEWS TV

రెండు తెలుగు రాష్ట్రాల్లో రిపోర్టర్స్ కావలెను

Contact : 9133613813




# నెంబర్-1 స్థానంలో నిలపడమే ధ్యేయం



## రూ.3,24,234 కోట్లతో తెలంగాణ బడ్జెట్

## అసెంబ్లీలో ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**రెవెన్యూ వ్యయం.. రూ.2,34,406 కోట్లు**

**మూలధన వ్యయం.. రూ.47,267 కోట్లు**



హైదరాబాద్, మార్చి 20 (పోలీస్ నిఘా) : తెలంగాణ ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం అసెంబ్లీలో రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2026-27 బ్జడెట్‌లో ప్రజా క్షేమం -సామాజిక న్యాయం అనే నినాదంతో ముందుకు సాగింది. ముందుగా అసెంబ్లీ కమిటీ హాల్‌లో మంత్రివర్గం సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. సంక్షేమం, మౌలిక సదుపాయాలకు సమ ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయం, విద్య, మౌళిక సదుపాయాలు తదితర రంగాలకు భారీగా నిధులు కేటాయించారు. బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ 1 స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. 'మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం' అని తెలిపారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ లక్ష్యమన్నారు. అంబేద్కర్ అడుగు జాడల్లోనే పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. అటు శాసనమండలిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా తాము చేస్తున్న కృషికి బడ్జెట్ తార్కాణమని, గత రెండేళ్ల అభివృద్ధి ఇందుకు నిదర్శనమని అన్నారు. మొత్తం బడ్జెట్ రూ.3,24,234 కోట్లు కాగా, అందులో రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లు, మూలధన వ్యయం రూ.47,267 కోట్లుగా చూపారు. బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు పరిశీలిస్తే 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఆరు గ్యారంటీల అమలుకు రూ. 50,713 కోట్లు కేటాయించారు. బడ్జెట్ లో 5 కీలక రంగాలకు భట్టి ప్రాధాన్యతనిచ్చారు. వ్యవసాయం, రైతు సంక్షేమం రూ. 23,179 కోట్లు కేటాయించారు. రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా, పంట బీమా, రుణమాఫీ పథకాలకు తెలంగాణ బడ్జెట్లో అగ్రతాంబూలం ఇచ్చారు. సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి సారించారు. సర్కారు విద్యారంగానికి భారీగా నిధులు కేటాయించింది. విద్య, నైపుణ్యాభివృద్ధి రూ. 26,674 కోట్లు కేటాయించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట అంతర్జాతీయ ప్రమాణాలతో గురుకుల పాఠశాలల నిర్మాణం, స్కిల్ యూనివర్సిటీతో యువతకు ఉపాధి కల్పించేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు భారీగా నిధులు కేటాయించారు. ప్రజా పాలన - ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇస్తూ మహాలక్ష్మి, గృహజ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), రూ. 500 కే గ్యాస్ సిలిండర్ వంటి ఆరు గ్యారెంటీల అమలుకు అవసర మైన నిధులను పుష్కలంగా కేటాయించారు.. మౌలిక సదుపాయాలకు గాను మూలధన వ్యయం రూ. 47,267 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో రోడ్లు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. గత పాలనలో ఆగిపోయిన పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టారు. సామాజిక భద్రత లో బీమా పథకాలను చేర్చారు. ప్రతి పేద కుటుంబానికి ధీమా కల్పించేందుకు ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకం కింద రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించడం ఈ బడ్జెట్‌లో ఒక కీలక అడుగుగాభావించాలి. జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేస్తారు.

మిగతా 6లో

### కేటాయింపులు ఇలా...

- ▸▸వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు
- ▸▸విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు
- ▸▸పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు
- ▸▸పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు
- ▸▸విద్యా శాఖకు రూ.26,674 కోట్లు
- ▸▸వైద్య శాఖకు రూ.13,679 కోట్లు
- ▸▸కార్మిక శాఖకు రూ.998 కోట్లు

## ఇది ఫ్యూచరిస్టిక్ బడ్జెట్: సీఎం రేవంత్


హైదరాబాద్, మార్చి 20 (పోలీస్ నిఘా) : అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యమిచ్చామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బడ్జెట్‌పై అసెంబ్లీలో ఆయన చిట్‌చాట్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ ఆర్థిక వృద్ధిని దృష్టిలో పెట్టుకొని మౌలిక వసతుల కల్పనకు సరిపడ నిధుల కేటాయింపు జరిగిందన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యానికి బడ్జెట్ పెద్ద పీట వేసిందన్నారు. అన్ని రంగాలు, అన్ని వర్గాలకు నిధులు కేటాయించామని, దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం ప్రవేశపెట్టామని చెప్పారు. ఈ పథకం ద్వారా రూ.5 లక్షల బీమా పరిహారం అందిస్తామన్నారు. రాష్ట్రంలోని దాదాపు కోటి 15లక్షల కుటుంబాలకు ఈ పథకం వర్తించనుందన్నారు. విద్యారంగంలో సంస్కరణలకు, ప్రజారోగ్య సంరక్షణకు అత్యధిక నిధులు కేటాయించామని, జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా రాష్ట్రంలో కూడా మార్పులు తీసుకు వస్తున్నామని, ప్రీ ప్రైమరీ నుంచి ప్లస్ టు వరకు విద్యార్థులు ఒకేచోట ప్రభుత్వ స్కూల్లో చదివే విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. అప్పులు, ఆదాయానికి సంబంధించి పారదర్శకంగా అన్ని వివరాలు వెల్లడించామన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు చేసిన అప్పు రూ.3.47లక్షల కోట్లు. ఇందులో నుంచి గత ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకే 3.30 లక్షల కోట్లు చెల్లించామని తెలిపారు. రాష్ట్ర ఆదాయం పెంచుకునేందుకు వివిధ విభాగాల్లో ఉన్న లీకేజీలను అరికడుతున్నామని, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు తెచ్చుకుంటున్నామని సీఎం చెప్పారు.

# భట్టి బడ్జెట్.. బోగస్ బడ్జెట్: హరీశ్‌రావు



హైదరాబాద్, మార్చి 20 (పోలీస్ నిఘా) : 'భట్టి బడ్జెట్.. బడా జూటా బడ్జెట్, బోగస్ బడ్జెట్' అని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. బడ్జెట్‌లో సకల జనులకు దక్కింది సున్నా మాత్రమేనని.. అంకెలు, మాటల గారడీ తప్ప ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ధ్వజమెత్తారు. తెలంగాణను, హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేయడం తప్ప.. భట్టి ప్రవేశ పెట్టిన పద్దులో ఏమీ లేదని దుయ్యబట్టారు. తమ హయాంలో అప్పులు చేసి.. ఆస్తులు సృష్టించామని, కాంగ్రెస్ రూ.3.5లక్షల కోట్ల అప్పుతో ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. కర్షకులకు రైతు భరోసా ఎగ్గొట్టినందుకు క్షమాపణ చెబుతారని భావిస్తే.. ఇష్టారీతిన అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. పెట్టుబడుల విషయంలోనూ కట్టుకథలే చెప్పారని, అక్రమ సంపాదన దాచుకునేందుకు విదేశీ పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో జీఎస్‌డీపీ వృద్ధి 12.50శాతం ఉండగా.. కాంగ్రెస్ పాలనలో 10.07 శాతానికి తగ్గిందన్నారు. బడ్జెట్ ద్వారా కాంగ్రెస్ చేతగాని తనం అర్థమైందని హరీశ్‌రావు విమర్శించారు.

# కువైట్‌లో కీలకమైన రిఫైనరీపై ఇరాన్ దాడి



ఇరాన్, మార్చి 20 : గల్ఫ్ దేశాల్లోని కీలక చమురు వ్యవస్థలే లక్ష్యంగా ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసింది. ఇటీవల ఖతార్‌లోని రస్ లఫాన్ గ్యాస్ క్షేత్రంపై, సౌదీ అరేబియాకు చెందిన అరామ్కోపై దాడులు చేయగా.. తాజాగా కువైట్‌లో కీలకమైన మినా అల్- అహ్మదీ ఆయిల్ రిఫైనరీపై డ్రోన్ దాడికి పాల్పడింది. కువైట్‌లో శుక్రవారం రంజాన్ పండుగ జరుపుకుంటున్న తరుణంలోనే ఈ దాడి జరగడం గమనార్హం. పశ్చిమాసియాలో అతిపెద్ద రిఫైనరీల్లో ఈ మినా అల్-అహ్మదీ కూడా ఒకటి. డ్రోన్ దాడి నేపథ్యంలో రిఫైనరీలో భారీగా మంటలు చెలరేగాయి. అధికారులు వాటిని అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనలో ఎవరైనా గాయపడ్డారా లేదా అనే విషయం ఇంకా తెలియరాలేదు. రోజుకి దాదాపు 7,30,000 బ్యారెళ్ల చమురు శుద్ధి చేయగల ఈ రిఫైనరీపై గురువారం కూడా ఇరాన్ దాడి చేసింది.

**దుబాయ్‌లో భారీ పేలుళ్లు..**

దుబాయ్ నగరం పైకి ఇరాన్ డ్రోన్‌లు దూసుకురాగా, వైమానిక రక్షణ వ్యవస్థలు వాటిని అడ్డుకొన్నాయి. ఈ క్రమంలో భారీ పేలుళ్లు వినిపించాయి. ఇక, తమపై దూసుకొచ్చిన ఓ క్షిపణిని అడ్డుకొన్నట్లు బహ్రెయిన్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వశాఖ తెలిపింది. ఈ క్రమంలో దాని శకలాలు ఓ గిడ్డంగిపై పడటంతో మంటలు చెలరేగాయని పేర్కొంది.

**మొజ్తాబా బతికే ఉన్నారు..**
**ఇదిగో ప్రూఫ్: ఇరాన్**

ఇరాన్ సుప్రీం నేతగా నియమితులైన మొజ్తాబా ఖమేనీ ఆరోగ్య పరిస్థితిపై ఇటీవల విభిన్న వార్తలు వినిపించాయి. తాజాగా వీటన్నింటిని తిప్పికొడుతూ.. ఆ దేశం ఓ వీడియోను విడుదల చేసింది. ఇరాన్ అధికారిక మీడియా ఐఆర్ఐబీలో ఖమేనీ వీడియో ప్రసారం అయ్యింది. సుప్రీం నేత కొంతమందికి మతపరమైన బోధనలు చేస్తున్నట్లు ఆ వీడియోలో ఉంది. అయితే, ఈ వీడియో ఎప్పటిదనే విషయాన్ని మాత్రం మీడియా స్పష్టం చేయలేదు. అమెరికా- ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో అలీఖమేనీ ప్రాణాలు కోల్పోయిన తర్వాత మొజ్తాబా బాహ్య ప్రపంచానికి కన్పించడం ఇదే తొలిసారి.

# ఫెయిల్డ్, ఫాల్స్, ఫ్యాన్సీ బడ్జెట్



**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు**

హైదరాబాద్, మార్చి 20 (పోలీస్ నిఘా) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ అత్యంత నిరాశాజనకంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు విమర్శించారు. బడ్జెట్‌పై ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్థిక మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బహుశా పొరపాటున గత ఏడాది బడ్జెట్‌నే చదివారేమో అన్న అనుమానం కలుగుతోందని, ఎందుకంటే పోయినసారి బడ్జెట్ కన్నా ఇందులో పెద్దగా మార్పులు చేర్పులు ఏమీ లేవని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో, ఎక్కడ అభివృద్ధి జరిగిందో చెప్పుకోవడానికి ఒక్క రిజల్ట్ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యంగా విద్యా రంగానికి ఈ బడ్జెట్‌లో తీరని అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగానికి గత ఏడాది కంటే రూ.1000 కోట్లు పెంచినట్లు చూపిస్తున్నా ఓవరాల్ బడ్జెట్‌లో దీని వాటా 8 శాతం మాత్రమేనని గుర్తు చేశారు. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ (13%), బీహార్ (21%) తమ బడ్జెట్‌లో విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతలో సగం కూడా తెలంగాణ ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీలు అని గొప్పలు చెప్పడం తప్ప విద్యా వ్యవస్థను మెరుగుపరిచే ఒక్క ప్రయత్నం కూడా కనిపించడం లేదన్నారు. ఆరోగ్య రంగం విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అట్టడుగున ఉందని నిలదీశారు. ఆరోగ్యశ్రీ బకాయిలే ఇంకా చెల్లించలేని రేవంత్ ప్రభుత్వం పెన్షన్లు, ఇతర బెనిఫిట్లను కూడా ఆరోగ్యశ్రీ డిపార్ట్‌మెంట్‌కే అప్పగించడం అంటే ఆ సంస్థను కూడా దివాలా తీయించడమేనని విమర్శించారు. అభివృద్ధి ఎక్కడ జరుగుతుందో చెప్పకుండా 'ఫ్యూచర్ సిటీ' అని ఫ్యాన్సీ పేర్లతో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన ఘనతగా చెప్పుకుంటున్న ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ అన్నీ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇచ్చే పథకాలతోపాటు, 'మేక్ ఇన్ ఇండియా', 'స్టార్టప్ ఇండియా' పథకాల వల్ల వచ్చినవేనని స్పష్టం చేశారు. రీజనల్ రింగ్ రోడ్ (ఆరఆరఆర్), దాని పక్కన వచ్చే రీజనల్ రింగ్ రైల్ కూడా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఫండింగ్ అని, కేవలం భూసేకరణ తప్ప రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని ఎండగట్టారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీనరేగా) స్థానంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వికసిత్ భారత్ రోజ్‌గార్ అజీవికా మిషన్ (గ్రామీణ) ((ఎఃఉ ఖీంఓఏఎ) చట్టం ద్వారా లబ్ధిదారులకు నేరుగా రూపాయికి రూపాయి అందుతుందని వెల్లడించారు. గతంలో కాంగ్రెస్ ప్రధాని రాజీవ్ గాంధీ స్వయంగా కేంద్రం రూపాయి పంపిస్తే లబ్ధిదారులకు చేరేసరికి 15 పైసలు మాత్రమే మిగులుతున్నాయని అన్నారని గుర్తు చేస్తూ నేడు నరేంద్ర మోదీ పాలనలో ఆ పరిస్థితి లేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం పంపే ప్రతి పైసా నేరుగా పేదవాడి ఖాతాకే చేరుతోందన్నారు. రైతుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి అబద్ధాలు ఆడుతోందని రామచందర్ రావు మండిపడ్డారు. ఐదు దఫాలుగా రైతు భరోసా ఇవ్వాల్సి ఉండగా, సరిగ్గా ఇవ్వకుండా..

▸▸మిగతా 6లో

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సీఎం



హైదరాబాద్, మార్చి 20 (పోలీస్ నిఘా) : పవిత్ర రంజాన్(ఈద్-ఉల్-ఫితర్) పండుగ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదర సోదరీమణులు తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల అందరితో సంతోషంగా రంజాన్ వేడుకలు నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి అన్నారు. ఉపవాస దీక్షలు, ప్రార్థనలతో ఆధ్యాత్మిక చింతన పెంచుకునే ఈ పండుగ.. సోదరభావాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. ముస్లింల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, లౌకికవాదానికి పెద్దపీట వేస్తామని ఆయన పేర్కొన్నారు. 'రంజాన్ పండుగ లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన రంజాన్ మాసంలో ముస్లింలు అనుసరించే కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, జకాత్, ఫిత్రా పేరుతో పేదలకు చేసే దాన ధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయి' అని రేవంత్ రెడ్డి చెప్పారు. గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని, ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా కలిసిమెలిసి సుఖ సంతోషాలతో జీవించేలా అల్లా దువా ఉండాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

## మెడికల్ సీట్ల భర్తీ వ్యవహారం..
## సుప్రీం కోర్టుకు యాజమాన్యాలు



న్యూఢిల్లీ, మార్చి 20 : తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న మెడికల్ సీట్ల భర్తీ వ్యవహారంపై వైద్య విద్య కళాశాలల యాజమాన్యాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. ఫిబ్రవరి 28తో కౌన్సెలింగ్ ముగిసిందని, అప్పటికి ఏపీలో 246, తెలంగాణలో 377 పీజీ సీట్లు భర్తీ కాలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లాయి. వీటిలో ఏపీలో సుమారు 45 కన్వీనర్ కోటా సీట్లు కూడా ఉన్నాయని జస్టిస్ పీఎస్ నర్సింహ, జస్టిస్ అలోక్ అరాథే ధర్మాసనం దృష్టికి యాజమాన్యాల తరఫు న్యాయవాదులు తీసుకొచ్చారు. కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని, కానీ, గడువు ముగియడంతో కౌన్సెలింగ్ ముగించారని కోర్టుకు వివరించారు. గడువు పెంచాలని ఫిబ్రవరి 28కి ముందే.. జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)కి సంబంధిత యూనివర్సిటీలు, కాలేజీలు విజ్ఞప్తి చేయగా.. ఎలాంటి సమాధానం రాలేదని కోర్టుకు న్యాయవాదులు వివరించారు. ఇదే పరిస్థితి తలెత్తితే.. కర్ణాటక, మహారాష్ట్రల్లో గడువు పెంచారని చెబుతూ.. సంబంధిత ఉత్తర్వులను కోర్టు ముందుంచారు. వైద్య విద్య కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్‌పై సమాధానం చెప్పాలని ఎన్ఎంసీకి ఆదేశిస్తూ.. తదుపరి విచారణను సర్వోన్నత న్యాయస్థానం మార్చి 23(సోమవారం)కి వాయిదా వేసింది.

## తిరుపతి వేదాంతపురం హాథిరామ్ మహారాజ్‌ను దర్శించుకున్న మోహన్ పవర్



దేవరకొండ, మార్చి 20 (పోలీస్ నిఘా) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి వేదాంతపురంలో ఉన్న ప్రఖ్యాత హాథిరామ్ మఠంలో మహానుభావుడు హాథిరామ్ మహారాజ్‌ను గిరిజన సంక్షేమ సంఘం నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ పవర్ భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మఠాధికారులు, సిబ్బంది మోహన్ పవర్ గారిని ఆత్మీయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా మఠం చైర్మన్ ముఖ్య శివా నాయక్ మోహన్ పవర్ గారిని శాలువాతో సన్మానించి, మఠ విశిష్టతలను వివరించారు. హాథిరామ్ మహారాజ్ శ్రీ వేంకటేశ్వర స్వామివారికి అత్యంత భక్తుడిగా ప్రసిద్ధి చెందారని, ఆయన జీవితం భక్తి, నిస్వార్థ సేవలకు ప్రతీకగా నిలిచిందని తెలిపారు. మోహన్ పవర్ మాట్లాడుతూ... హాథిరామ్ మఠం దేశవ్యాప్తంగా బంజారా సమాజానికి ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్నదని పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలో నివసిస్తున్న బంజారా సోదర సోదరీమణులు తప్పనిసరిగా ఈ పవిత్ర స్థలాన్ని సందర్శించి హాథిరామ్ మహారాజ్ ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు. ఇలాంటి పుణ్యక్షేత్రాలు మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన అన్నారు.

## సీఎం సహాయ నిధి పేదలకు వరం




రెబ్బెన, మార్చి 20 (పోలీస్ నిఘా) : కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రానికి చెందిన ప్రభులాల్ జైస్వాల్ కి సిఎం సహాయనిధి నుండీ చెక్కులు మంజూరు ఆయినావి. అట్టి చెక్కును కుటుంబ సభ్యులకు శుక్రవారం రోజున ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ అజ్మెరా శ్యామ్ నాయక్, ఏఎంసి చైర్మన్ ఇరుకుల్లా మంగ, వారికీ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ గాజుల రవీందర్, రెబ్బెన మాజీ జడ్పీటీసీలు పల్లె ప్రకాష్ రావు, దుర్గం సోమయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోడెం సుదర్శన్ గౌడ్, మోడెం చిరంజీవి గౌడ్, రెబ్బెన మాజీ ఉప సర్పంచ్ మడ్డి శ్రీనివాస్ గౌడ్, నాయకులు సురేష్ జైస్వాల్, తదితరులు పాల్గొన్నారు.

## 'నేషనల్ లోక్‌అదాలత్'ను వినియోగించుకోవాలి

### కాజీపేట ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ పి వెంకన్న



కాజిపేట్, హన్మకొండ, మార్చి 20 (పోలీస్ నిఘా) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో డ్రంక్ అండ్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ , మైనర్ డ్రైవింగ్ కేస్ లలో వాహనం సీజ్ చేయబడితే ఈ నెల 23 సోమవారం నుండి 28 శనివారం వరకు హనుమకొండ సెకండ్ క్లాస్ కోర్టులో "నేషనల్ లోక్ అదాలత్ "లో హాజరై కేసు క్లోజ్ చేసుకోగలరని విజ్ఞప్తి చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వారి ఆధార్ కార్డు జిరాక్స్ వెహికల్ డాక్యుమెంట్స్, డ్రైవింగ్ లైసెన్స్ కేసు ఉన్నవారు ఆధార్ కార్డు, లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న రశీదు, మైనర్ డ్రైవింగ్ కేసులో బర్త్ సర్టిఫికెట్ లేదా ఎస్ఎస్సి మెమో సమర్పించి తక్కువ జరిమానాతో కేసు క్లోజ్ చేసుకోవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పి వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు.

## రెబ్బెనలో 'ఖుషీ మిల్లెట్ & సీసీ కెమెరాల' షాపును ప్రారంభించిన అజ్మీరా శ్యామ్ నాయక్





రెబ్బెన, మార్చి 20 (పోలీస్ నిఘా) : రెబ్బెన మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ' శ్రీనివాస్ పంతులు ఖుషీ మిల్లెట్ & సీసీ కెమెరాల' దుకాణాన్ని శుక్రవారం ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ తో కలిసి రెబ్బెన కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్యామ్ నాయక్ మాట్లాడుతూ.. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ప్రజల ఆరోగ్యానికి చిరుధాన్యాలు (మిల్లెట్స్) ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ వీటిని ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా, ప్రస్తుత కాలంలో భద్రతకు సీసీ కెమెరాల ప్రాధాన్యత ఎంతో ఉందని, వీటి ద్వారా నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. ఒకే చోట ఆరోగ్యం మరియు భద్రతకు సంబంధించిన సేవలను అందుబాటులోకి తెచ్చిన శ్రీనివాస్ పంతులు ని ఆయన అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, వైస్ ఛైర్మన్ గాజుల రవీందర్, డైరెక్టర్ మారుతి పటేల్, మాజీ జెడ్పీటీసీలు పల్లె ప్రకాష్ రావు, దుర్గం సోమయ్య, సీనియర్ నాయకులు మోడెం సుదర్శన్ గౌడ్, చిరంజీవి గౌడ్, ఎండీ నిజాం, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, నాయకులు సురేష్ జైస్వాల్ మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో జర్నలిస్టులకు మొండి చెయ్యి

**జర్నలిస్టుల పట్ల వివక్ష తగదు**

**టీడబ్ల్యూజేఎఫ్ నేత మామిడి సోమయ్య**



హైదరాబాద్, మార్చి 20 (పోలీస్ నిఘా) : రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమానికి ఎటువంటి కేటాయింపులు చేయకుండా మొండి చేయి చూపిందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు పెద్ద ఎత్తున బడ్జెట్ కేటాయింపులు చేసిన ప్రభుత్వం జర్నలిస్టులకు సంబంధించి ఎటువంటి ప్రస్తావన చేయకపోవడం, నిధులు కేటాయించకపోవడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. గత రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులను విస్మరించిందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ను పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటిదాకా చిన్న మధ్యతర పత్రికలకు ఇచ్చిన అడ్వర్టైజ్మెంట్ల బిల్లులు కూడా చెల్లించకపోవడం విచారకరమని అదే విధంగా మీడియా అకాడమీకి బడ్జెట్లో ఏమి చెప్పలేదని ఆయన తెలిపారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమాలను ఎలా అమలు చేస్తారని, ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, సంక్షేమ కార్యక్రమాల అంశాలేమీ చెప్పలేదని అన్నారు. ప్రభుత్వం వచ్చిన తరువాత జర్నలిస్టులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని, కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని అన్నారు. చనిపోయిన జర్నలిస్టులకు ఇచ్చే ఆర్థిక సహాయం పెంచాలని ఇళ్ల స్థలాలు కేటాయించాలని హెల్త్ కార్డులు ఇవ్వాలని గత రెండేళ్లుగా తాము ప్రభుత్వాన్ని పదేపదే కోరుతున్నప్పటికీ ప్రభుత్వం తమ డిమాండ్లను పెడచెవిన పెడుతూ జర్నలిస్టులను నిర్లక్ష్యం చేస్తుందని ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఈ బడ్జెట్ పై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమాజం దృష్టికి తీసుకుపోతున్న మీడియా పట్ల పాలకులు పూర్తి నిర్లక్ష్యం వహించడం సహించరానిదని, తక్షణమే జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల నిరసన తెలియజేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

## తల్లి పేరనున్న భూమిని సమానంగా పంచాలి

**అన్నదమ్ముల సమస్యలోకి పొంగులేటిని, దయాకర్‌రెడ్డిని లాగొద్దు**

**తండ్రి పేరనున్న భూమిని కాజేసేందుకు యత్నం**

**మీడియా సమావేశంలో కొప్పుల రమేష్ అన్నదమ్ములు**




ఖమ్మం, మార్చి 20 (పోలీస్ నిఘా) : తల్లి పేరనున్న భూమిని ఆమె ఐదుగురు కొడుకులకు సమానంగా పంచాలని వారసులు కోరారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో కొప్పుల రమేష్, కొప్పుల నాగేశ్వరరావు, కొప్పుల జనార్దన్, కొప్పుల జైపాల్, కొప్పుల నాగేశ్వరరావు తండ్రి జైపాల్ కోరారు. ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెంకు చెందిన వారు మీడియాతో మాట్లాడుతూ తీర్థాల రెవెన్యూలోని760 సర్వే నెంబర్‌లో కొప్పుల పేరమ్మ పేరు మీద ఉన్న 4.13 కుంటలు మెట్ట భూమిని కొప్పుల రామారావు తన భార్య సుధారాణి పేరు మీద, ఎకరం ఒక కుంట మాగాణిని అతని కొడుకు ప్రపుల్లకుమార్ పేరు మీద దొంగతనంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని తెలిపారు. ఇది తెలుసుకున్న రామారావు తల్లి వీరమ్మ దానిని రద్దు చేయించి, తన ఐదుగురు కొడుకులకు సమానంగా పంచాలని వీలునామా రాసిందని, అఫిడవిట్‌లో పేర్కొందని తెలిపారు. కొప్పుల పుల్లయ్య పేరు మీద ఉన్న 5 ఎకరాల 32 కుంటల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు రామారావు యత్నిస్తున్నాడని ఆరోపించారు. ఇది అన్నదమ్ముల, పాలెభాగాల సమస్య అని అన్నారు. ఇందులోకి అనవసరంగా మంత్రి పొంగులేటిని, ఆయన క్యాంప్ ఆఫీస్ ఇన్‌ఛార్జి దయాకర్‌రెడ్డిని లాగుతున్నారని, ఇది సరి కాదని పేర్కొన్నారు. తమ సమస్యకు, పొంగులేటికి, దయాకర్‌రెడ్డికి సంబంధం లేదని స్పష్టం చేశారు. మంత్రి అంటే గిట్టని వారు కొప్పుల రామారావు, జగదీష్‌తోటి రాజకీయంగా పూయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. తమ సమస్యను తామే పరిష్కరించకుంటామన్నారు. దీనికి రాజకీయం పూయవద్దని సూచించారు.

# నాలుగో స్తంభానికే ద్రోహమా?




**జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పోరాటానికి బీజేపీ అండ**

**పాలకుల కన్ను.. జర్నలిస్టుల స్థలాలపైనేనా?**

**సొంతింటి కోసం కలం యోధుల పోరు..**


**కల్లబొల్లి మాటలు కట్టిపెట్టి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని బీజేపీ డిమాండ్**

**ఆ హామీలు ఏమయ్యాయి పొంగులేటి?**

**జర్నలిస్టుల దీక్షా శిబిరంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు సూటి ప్రశ్న**

ఖమ్మం, మార్చి 20 (పోలీస్ నిఘా) : సమాజంలో ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా ఉంటూ, అహర్నిశలు శ్రమిస్తున్న జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. అర్హులైన జర్నలిస్టులందరికీ తక్షణమే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మంలో విలేకరులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు బీజేపీ పూర్తి మద్దతు ప్రకటించింది. శుక్రవారం ఈ దీక్షా శిబిరాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు సందర్శించి జర్నలిస్టుల పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరిని, స్థానిక మంత్రుల నిర్లక్ష్యాన్ని వారు తీవ్రంగా ఎండగట్టారు. అధికారంలోకి రాకముందు ఎన్నో హామీలు గుప్పించిన కాంగ్రెస్ నాయకులు, గద్దెనెక్కాక ఏ వర్గాన్నీ దగా చేయకుండా వదిలిపెట్టలేదని విమర్శించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విలేకరులను మోసం చేయడం పాలకుల పతనానికి నాంది అని వారు హెచ్చరించారు. ముఖ్యంగా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుల తీరుపై బీజేపీ నేతలు తీవ్ర విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే, తన సొంత డబ్బులతో ఇళ్లు నిర్మించి ఇస్తానని గొప్పలు చెప్పిన మంత్రి పొంగులేటి.. ఇప్పుడు ఆ మాటలను ఎందుకు నిలబెట్టుకోవడం లేదని నిలదీశారు. ఎస్సార్ గార్డెన్స్ (ఫంక్షన్ హాల్) వెనుక జర్నలిస్టుల కోసం గతంలో కేటాయించిన భూమిపై కొందరు పెద్దల కన్ను పడిందని, దాన్ని కబ్జా చేసే ఉద్దేశంతోనే పంపిణీలో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు, ఈ న్యాయమైన సమస్యను పరిష్కరించాల్సింది పోయి, ఈ వ్యవహారంలో తనను లాగొద్దంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దాటవేత ధోరణి అవలంబించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. అవినీతి, భూకబ్జాలతో వేల కోట్లు వెనకేసుకుంటున్న నాయకులు, సమాజం కోసం పనిచేసే విలేకరుల సొంతింటి కలను నెరవేర్చడంలో ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని బీజేపీ నేతలు ప్రశ్నించారు. ప్రభుత్వం కల్లబొల్లి మాటలు కట్టిపెట్టి, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసే ప్రక్రియను తక్షణమే వేగవంతం చేయాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విలేకరుల పక్షాన నిలబడి ఆందోళనలను తీవ్రతరం చేస్తామని, ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మందడపు సుబ్బారావు, రవి రాథోడ్, మంద సరస్వతి, మారుతినేని వీరభద్ర ప్రసాద్, గడిలా నరేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## నేడే రంజాన్ పండగ



హైదరాబాద్, మార్చి 20 (పోలీస్ నిఘా) : పవిత్ర రంజాన్ మాసం ముగిసింది. చివరి శుక్ర వారం దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గురువారం నెలవంక దర్శనం లేకపోవడంతో శుక్రవారం నెలవంక ఆధారంగా శనివారం రంజాన్ పండగను నిర్ణయించారు.

## కేటాయింపులు సరే... ఖర్చు పైనే సంశయం

**-సిపిఐ నేత భాగం హేమంతరావు-**




ఖమ్మం, మార్చి 20 (పోలీస్ నిఘా) : శాసనసభలో ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్లో భారీ గణాంకాలు నమోదయ్యాయి కానీ కేటాయింపుల వారీగా ఖర్చులపైనే సంశయం ఉందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. బడ్జెట్పై ఆయన స్పందిస్తూ అంకెలను ఘనంగా చూపించి ప్రజలను ఏమార్చే ప్రయత్నం ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయని అప్పులతో కుంగిపోతున్న –రాష్ట్రంలో ఈ బడ్జెట్లో కేటాయించిన విధంగా అమలు చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. రూ.3.24 లక్షల కోట్ల బడ్జెట్లో వ్యవసాయ –రంగానికి కేవలం పది శాతం మాత్రమే అంటే రూ.32వేల కోట్లు మాత్రమే కేటాయించారని ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ రంగానికి తీరని –అన్యాయం జరిగిందన్నారు. అధికారంలోకి రాక ముందు చెప్పిన విధంగా బడ్జెట్లో కేటాయింపులు జరగలేదన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు –సంబంధించిన కేటాయింపులు కూడా అరకొరగానే ఉన్నాయన్నారు. పాత బిల్లుల చెల్లింపుకే కేటాయింపులు సరిపోతాయన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు తులం బంగారం విషయాన్ని పట్టించుకోలేదన్నారు. రుణమాఫీ, రైతు బంధు, సంక్షేమం గురించి గొప్పగా చెప్పినప్పటికీ కేటాయింపు ఆ స్థాయిలో లేదని ఆయన అన్నారు. పింఛన్ పెంపుకు సంబంధించి ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లుగా నాలుగు వేలకు పెంచేందుకు ఈ బడ్జెట్లో కేటాయింపులు లేవన్నారు. విద్య, వైద్యానికి కేటాయింపులు సరైన రీతిలో లేవని ఏడాది కాలంగా ప్రభుత్వం ఇచ్చిన –ఏ హామీకి సంబంధించి కేటాయింపులు లేవని హేమంతరావు తెలిపారు. బడ్జెట్పై ఎన్నో అంచనాలతో ఉన్న రాష్ట్ర ప్రజలకు భట్టి బడ్జెట్ –సంతృప్తిని ఇవ్వలేకపోయిందన్నారు. ప్రధానమైన వ్యవసాయం, విద్య, వైద్యం కేటాయింపులు ఆశించిన స్థాయిలో లేవని సంక్షేమం, అభివృద్ధి కూడా ఈ కేటాయింపుల ప్రకారం ఆశించిన స్థాయిలో జరగదని ఆయన తెలిపారు. మొత్తంగా అంకెలు గనం అమలు శూన్యమన్న రీతిలో బడ్జెట్ ఉందని ఇక అమలుపై అనేక సంశయాలు ఉన్నాయని హేమంతరావు తెలిపారు.

## రాష్ట్ర బడ్జెట్ అంతా డొల్ల: ఎంపీ వద్దిరాజు



ఖమ్మం, మార్చి 20 (పోలీస్ నిఘా) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా విస్మరించిందని, బీసీలకు మరోసారి మోసం జరిగిందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర వ్యాఖ్యానించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క 3,24,234 కోట్ల భారీ బడ్జెట్ ను ప్రవేశపెట్టి జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు 5%నిధులు కూడా కేటాయించకపోవడం విచారకరమని ఎంపీ రవిచంద్ర తన ప్రకటనలో పేర్కొన్నారు. సమగ్ర సర్వే సందర్భంగా బీసీల జనాభాను 40లక్షలకు పైగా తగ్గించి చూపడమే కాక, కామారెడ్డిలో ఆర్భాటంగా ప్రకటించిన 42% రిజర్వేషన్లను అమలు చేయడంలో, ప్రతి ఏటా బడ్జెట్లో 20వేల కోట్ల చొప్పున కేటాయిస్తామన్న హామీని కాంగ్రెస్ సర్కార్ నిలబెట్టుకో వడంలో విఫలమైందని ఆయన మండిపడ్డారు. మంత్రిమండలిలో యాదవ, మున్నూరుకాపు, రజక, లంబాడీలకు స్థానం కల్పించకుండా, కార్పోరేషన్ ఛైర్మన్ల నియమాకాలలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని ఎంపీ రవిచంద్ర ఆవేదన వెలిబుచ్చారు. ఎన్నికల సమయంలో యువత ఓట్ల కోసం 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీనిచ్చి నెరవేర్చకపోవడంతో విద్యావంతులైన నిరుద్యోగ యువత తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. వృత్తి విద్యా కోర్సులు చదువుతున్న వారి ఫీజు బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడం, బడ్జెట్లో ఆ ప్రస్తావనే లేకపోవడం శోచనీయమని ఎంపీ రవిచంద్ర అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం గురించి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొనకపోవడం విచారకరమన్నారు. మంత్రివర్గంలోకి వెంటనే ముగ్గురు బీసీలను తీసుకోవాలని, 42%రిజర్వేషన్ల అమలునకు పార్లమెంటులో బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన ప్రైవేట్ మెంబర్ బిల్లుకు కాంగ్రెస్ అధిష్టానాన్ని ఒప్పించి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర వత్తిడి పెంచాల్సిందిగా ఎంపీ వద్దిరాజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.

## రైతు పక్షపాతి బడ్జెట్...



బోనకల్, మార్చి 20 (పోలీస్ నిఘా) : శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్ పై మధిర నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ రాయన్నపేట సర్పంచ్ కర్నాటి రామా కోటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.. కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్ తెలంగాణ ఆర్థిక వ్యవస్థ పునర్జీవనానికి పునాది వేసిందని ఆనందించారు.. రాష్ట్రాన్ని పునర్నిర్మించుకోవడం పై దృష్టి పెట్టారని అందుకే డాంబికాలకు పోకుండా వాస్తవిక దృక్పథంతో బడ్జెట్ ను రూపొందించారని పేర్కొన్నారు.. ఆర్థిక శాఖ మంత్రిమల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్లో వ్యవసాయ శాఖ కు 23,179 కోట్ల రూపాయలు, విద్యుత్ శాఖ కు 21,285 కోట్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు రు 7,430 కోట్లు, రాజీవ్ విద్య వికాస్ నికి రు 6000 వేల కోట్లు, వైద్య ఆరోగ్య శాఖ కు 13,674 కోట్లు ఎస్సీ, ఎస్టీ బీసీల సంక్షేమానికి పెద్ద యెత్తున నిధులు కేటాయించిన ప్రభుత్వం, 6 గ్యారంటీల అమలుకు పద్దులో 50వేల కోట్లు అధిక మొత్తం కేటాయించారన్నారు.. అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా రూపదిద్దుతుందని తెలిపారు.. అందుకే విద్య వైద్యం వ్యవసాయ సాగునీటి రంగాల అభ్యున్నతి సంక్షేమ అభివృద్ధిని సహకారం చేసే దిశగా సీఎం రేవంత్ రెడి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వడివడిగా అడుగులు ముందుకు వేస్తుందని వివరించారు.

## జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా గత్తం బాలరాజు




బోనకల్, మార్చి 20 (పోలీస్ నిఘా) : ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీలో బోనకల్ మండలం నుండి చిన్న బీరవల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు గత్తం బాలరాజు ను జిల్లా కమిటీ లో ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నియమించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియార్టీకి విధేయతకు పెద్దపీట వేసినట్లు కులమత బెదం లేకుండా అపార కాలం నుండి కాంగ్రెస్ నమ్ముకున్న వ్యక్తులకు న్యాయం చేసినట్లు తెలిపారు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని కి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ కి మధిర ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరావుకి బోనకల్ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు కి పిసిసి మెంబర్ పైడిపల్లి కిషోర్ కుమార్ కి కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా చిన్న బీరవల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ గత్తం బాలరాజును అభినందించారు.

పోలీస్ నిఘా

సంపాదకీయం | శనివారం | 21 మార్చి 2026

## ఇంధనమే అన్నిటికీ మూలం

మధ్యప్రాచ్యంలో యుద్ధం కారణంగా తలెత్తిన ఇంధన సంక్షోభంలో చిక్కి ప్రపంచ దేశాలు విలవిలలాడుతున్నాయి. ముడిచమురు, లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పిజి) వంటి ఇంధనాలను పుష్కలంగా కలిగిన రష్యా, వెనెజువెలా వంటి కొద్ది దేశాలకు మాత్రమే ఇందులో మినహాయింపు. తాజా పరిస్థితుల కారణంగా ప్రపంచంలోనే ముడిచమురును అత్యధికంగా దిగుమతి చేసుకునే దేశాల్లో ఒకటైన భారత్‌ను ఇంధన సంక్షోభం పట్టి కుదిపివేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా చమురు రవాణాకు సముద్ర మార్గాలే కీలకం. ఎనభై శాతం చమురు జలమార్గాల గుండానే వివిధ దేశాలకు సరఫరా అవుతోంది. ఈ మార్గాలకు ఏదైనా అవాంతరం వాటిల్లితే అనేక దేశాలు చమురు అందక సతమతమవుతాయి. ఇప్పుడు జరుగుతున్నది అదే. అమెరికా, ఇజ్రాయెల్ మూకుమ్మడిగా ఇరాన్‌పై విరుచుకుపడటంతో గల్ఫ్ దేశాలనుంచి ఇంధన నౌకలు రాకపోకలు సాగించే హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. ఫలితంగా ఇరాన్, ఇరాక్, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా తదితర దేశాలనుంచి చమురు రవాణా దాదాపుగా స్తంభించిపోయింది. గ్యాస్ సిలిండర్లు అందక మధ్యతరగతి, పేదవర్గాల వంటిళ్లలో పొయ్యిలో పిల్లి లేవడం లేదు. మెస్‌లు, హోటళ్లు, హాస్టళ్లు, ఆస్పత్రులలోని క్యాంటీన్లు సైతం గ్యాస్ లేక నత్తనడక నడుస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్లకు కొరత లేదంటూనే వాణిజ్య సిలిండర్ల విక్రయంపై ఆంక్షలు విధించి, గృహోపయోగానికి వినియోగించే సిలిండర్లు సజావుగా సరఫరా అయ్యేందుకు చర్యలు చేపడుతోంది. చమురు, సహజవాయువు సరఫరాకు సమస్యలు తలెత్తకుండా నిత్యావసర సరకుల చట్టాన్ని ప్రయోగించడాన్ని బట్టి పరిస్థితి ఎంత జటిలంగా ఉందో అర్థమవుతోంది. గ్యాస్ బండతో సగటు భారతీయ మహిళకున్న అనుబంధం మాటల్లో చెప్పలేనిది. స్వాతంత్ర్యం వచ్చిన ఏడెనిమిదేళ్లకు దేశంలోకి ప్రవేశించిన గ్యాస్ సిలిండర్ తో వంటింట్లో పడుతున్న కష్టాలనుంచి మహిళలకు కూడా స్వాతంత్ర్యం లభించినట్లయింది. కట్టెలు, పిడకలతో వంట చేయలేక, పొగతో ఊపిరాడక పడే బాధలనుంచి వారికి విముక్తి లభించింది. తాజా సంక్షోభం వారు ఇంతకుముందు ఎరగనిది. అనుకోకుండా వచ్చిపడిన ఈ ఉపద్రవంనుంచి ఎలా గట్టెక్కాలో తెలియక సగటు భారతీయ మహిళ సతమతమవుతోంది. సౌరశక్తి ఆధారంగా నడిచే సోలార్ కుక్కర్లు, హైబ్రిడ్ సోలార్ స్టవ్‌లు, ఇండక్షన్ స్టవ్ లు వంటి సాధనాలు ఉన్నా, ధరలు అందుబాటులో లేని కారణంగా వీటి వినియోగం అంతంతమాత్రంగానే ఉంది. ముడిచమురును అత్యధికంగా దిగుమతి చేసుకునే దేశాల్లో అమెరికా, చైనా తర్వాత మూడో స్థానం భారత్ దే. 2040 నాటికి మన చమురు అవసరాలు ఆకాశాన్నంటుతాయన్నది ఒక అంచనా. అటువంటి పరిస్థితుల్లో భౌగోళిక రాజకీయ ఘర్షణలు తలెత్తినా, సరఫరా గొలుసులో అంతరాయాలు ఏర్పడినా చమురు అందక ఆయా దేశాలు సంక్షోభంలో కూరుకుపోక తప్పదు. తాజా ఉదంతమే ఇందుకు ఉదాహరణ. రవాణా సమస్యల కారణంగా ఇరాక్, కువైట్‌లలో ముడి చమురు, ఎల్‌పిజి ఇంధన నిల్వలు పేరుకుపోయాయి. దీంతో ఆయా దేశాలు ఉత్పత్తిని తగ్గించాయి. మరోవైపు ఇరాన్ లోని చమురు కేంద్రాలను అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యం చేసుకుంటున్నాయి. ఇప్పటికే సౌదీ అరేబియాలోని అరాంకోకు చెందిన అతి పెద్ద చమురు శుద్ధి రిఫైనరీ రస్ తనూరా మూతబడింది. ఈ నేపథ్యంలో యుద్ధం ముగిసినా ఇప్పటికిప్పుడు చమురు కొరతనుంచి గట్టెక్కుతామని అనుకోవడానికి వీలు లేదు. కాబట్టి, తాజా ఉదంతంనుంచి మనం పాఠాలు నేర్వకపోతే జాతి క్షమించదు. చమురు దిగుమతులు మన ఆర్థిక వ్యవస్థను దిగజారుస్తున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై పాలకులు ఇకనైనా దృష్టి సారించాలి. గత దశాబ్ద కాలంగా దేశంలో సౌరశక్తి వినియోగం పుంజుకున్నమాట వాస్తవమే. అయినా ఇప్పటికీ ఇది సామాన్యుడికి అందుబాటులో లేదనడం అతిశయోక్తి కాదు. పిఎం-కుసుమ్, ప్రధాని సూర్యఘర్, ముఫ్త్ బిజిలీ యోజన వంటి పథకాల ద్వారా మధ్యతరగతి ప్రజానీకం ఇప్పుడిప్పుడే సౌరశక్తి వినియోగంవైపు మొగ్గు చూపుతోంది. ఈ నేపథ్యంలో సహజ వాయువు, సౌరశక్తి వినియోగం పెంచడాన్ని పాలకులు ఒక ఉద్యమంగా చేపట్టవలసిన అవసరం ఉంది. అదే సమయంలో దేశీయంగా ముడిచమురు వెలికితీతకు నడుం బిగించాలి. రాజస్తాన్ లోని బర్మర్ జిల్లా, గుజరాత్ లోని గల్ఫ్ ఆఫ్ ఖంబాట్, ముంబయి హై, గోదావరి- కృష్ణా బేసిన్, అసోంలలో మాత్రమే ప్రస్తుతం చమురు ఉత్పత్తి అవుతోంది. ఇవిగాక, గుజరాత్ లోని కచ్, కావేరీ బేసిన్, ఒడిశాలోని మహానది బేసిన్, బెంగాల్ లోని హుగ్లీ బేసిన్ లో చమురు, సహజ వాయువు అపారంగా ఉన్నట్లు వెల్లడైన నేపథ్యంలో, అక్కడ వనరుల వెలికితీతకు ఉపక్రమించడం అత్యవసరం.

# రెండు విడతలు ఎవరికి లాభం?



ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది పశ్చిమబెంగాల్. ఇక్కడ తృణమూల్ కాంగ్రెస్ మూడుసార్లు అధికారంలోకి వచ్చింది. ఈసారి కూడా నిలబెట్టుకుంటుందని సర్వేలు చెబుతున్నాయి. ఇదే సమయంలో తృణమూల్‌ను కొట్టేందుకు బీజేపీ సర్వశక్తులు ఒడ్డుతోంది. ఈ నేపథ్యంలో ఈసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. 294 స్థానాలకు రెండు విడతల్లో పోలింగ్ నిర్వహించాలని నిర్ణయించింది. ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ జరుగుతుంది. 150 సీట్లు మొదటి దశ, 144 సీట్లకు రెండో దశలో పోలింగ్ నిర్వహిస్తారు. 2021లో ఆరు విడతలు జరిగినప్పటికీ, ఈసారి తగ్గింపు భద్రతా కారణాల వల్లనే అని ఎన్నికల సంఘం వివరించింది.

**ఈసీపై మమతా ఆరోపణలు..**

తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం రెండు విడతల పోలింగ్‌తో తమకు నష్టం అని పేర్కొంటోంది. గతంలో ఆరు విడతల్లో ఎన్నికలు జరిగిన సమయంలోనూ ఇలాగే ఈసీని తప్పు పట్టింది. బీజేపీపై ఆరోపణలు చేసింది. ఇప్పుడు రెండు విడతలనూ తప్పు పడుతున్నారు. ఎక్కువ దశలు ఓటర్లను ప్రభావితం చేస్తాయని, ఇప్పుడు తగ్గింపు కూడా సవాలుగా మారిందని పార్టీ వ్యూహకర్తలు భావిస్తున్నారు.

**చారిత్రక నేపథ్యం..**

2001లో వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో బెంగాల్‌లో ఒకే విడతలో పోలింగ్ నిర్వహించారు. నాడు కమ్యూనిస్టులు అధికారంలో ఉన్నారు. ఇక 2006, 2011లో 5, 6 విడతల్లో పోలింగ్ నిర్వహించారు. 2016, 21లో ఆరు విడతలు నమోదయ్యాయి. శాంతి, భద్రతా పరిస్థితుల ఆధారంగా ఈసీ నిర్ణయాలు తీసుకుంటుంది. ఈసారి తగ్గింపు బీజేపీ ఒత్తిడి కారణమని తృణమూల్ ఆరోపిస్తోంది.

**పటిష్ట భద్రత..**

గత ఎన్నికల్లో టీఎంసీ-బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు జరిగాయి. ఈసారి అల్లర్లను అరికట్టేందుకు కేంద్రం పటిష్ట చర్యలు చేపట్టింది. 1.5 లక్షల కేంద్ర బలగాలను బెంగాల్‌కు పంపాలని నిర్ణయించింది. ఇప్పటికే 50 వేల పోలీసులను మోహరించారు. మరోవైపు ఈసీ కూడా అల్లర్లు జరగకుండా పోలింగ్ బూతులు కాలనీల్లో ఏర్పాటు చేశారు. దొంగా ఓట్లు తొలగింపు ఓటర్ల ధైర్యాన్ని పెంచుతాయి. ఈ చర్యలు నిర్భయ పోలింగ్‌కు దోహదపడతాయి. సర్వేలు బీజేపీ ఓటు శాతం 41-48%కు పెరిగిందని, టీఎంసీకి స్వల్ప ఆధిక్యమేనని చెబుతున్నాయి. రెండు విడతలు భయాన్ని తచ్చించకుండా ఓట్లు వేయించి, బీజేపీకి మేలు చేస్తాయని విశ్లేషకులు అంచనా. టీఎంసీ బలపడిన ప్రాంతాల్లో కూడా పోటీ తీవ్రంగా ఉంటుంది. ఫలితాలు రాజకీయ భవిష్యత్తును రూపొందిస్తాయి.

# కేబినెట్ ప్రక్షాళనకు ముహూర్తం ఫిక్స్




తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణకు తాజాగా కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతుంది. ఏప్రిల్ మొదటి వారంలో మంత్రి వర్గ విస్తరణ జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రస్తుత మంత్రుల్లో ఒకరిని పక్కన పెట్టి.. అదే సామాజిక వర్గానికి చెందిన మరొకరిని మంత్రి వర్గంలోకి తీసుకుంటారని.. లంబాడా సామాజిక వర్గానికి మంత్రి వర్గంలో చోటు కల్పిస్తారని.. ఆ మేరకు పార్టీ హైకమాండ్‌తో సీఎం రేవంత్ రెడ్డి చర్చించినట్లు తెలిసింది. సీఎం రేవంత్ రెడ్డి మంగళ, బుధవారాల్లో ఢిల్లీలో పర్యటించారు. రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌లతో కలిసి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ భేటీలో రాష్ట్రంలో ప్రభుత్వ పాలన, పార్టీలో జరుగుతున్న తాజా వ్యవహారాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో మంత్రివర్గ విస్తరణ అంశంకూడా వీరి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. మంత్రివర్గ విస్తరణలో భాగంగా ఎవరిని పక్కన పెట్టాలి.. ఎవరిని కొత్తగా మంత్రి వర్గంలోకి తీసుకోవాలి అనే విషయాలపై వీరు చర్చించినట్లు తెలిసింది. ఈ క్రమంలో మంత్రివర్గ విస్తరణకు హైకమాండ్ సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, ఏప్రిల్ మొదటి లేదా రెండో వారంలో మంత్రివర్గ విస్తరణ ఖాయంగా జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. మంత్రివర్గ విస్తరణ కోసం కాంగ్రెస్ పార్టీలోని అనేక మంది ఎమ్మెల్యేలు ఎదురు చూస్తున్నారు. కొందరు ఇప్పటికే మంత్రివర్గంలో చోటుకోసం ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలతో సంప్రదింపులు జరుపుతున్నారు. అయితే, సీఎం రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ లు సూచించిన వారికి మంత్రివర్గంలో చోటు దక్కబోతుందని తెలుస్తోంది. ఇటీవల కాలంలో తరచూ వివాదాస్పదమవుతున్న ఓ మంత్రికి ఉద్వాసన పలికి.. వారి స్థానంలో అదే సామాజిక వర్గానికి చెందిన వారికి మంత్రివర్గంలో అవకాశం కల్పించేందుకు కాంగ్రెస్ హైకమాండ్ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణలో భాగంగా లంబాడా సామాజిక వర్గానికి చెందిన వారికి చోటు దక్కడం ఖాయంగా చెబుతున్నారు. ఈ కోటాలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు నేతల్లో ఒకరికి మంత్రి పదవి వరించబోతుందని తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో కీలకమైన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు మంత్రివర్గంలో ప్రాధాన్యతలేదు. దీంతో మంత్రివర్గ విస్తరణలో ఈ జిల్లా నుంచి ఒకరికి అవకాశం ఇవ్వాలన్న డిమాండ్ ఉంది. కానీ, ఆ మేరకు అవకాశాలు లేవన్న చర్చ జరుగుతుంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి స్పీకర్‌గా ప్రసాద్ కుమార్ ఉన్నారు. అయితే, డిప్యూటీ స్పీకర్ పదవి కూడా ఆ జిల్లాకు కేటాయించాలని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఆ జిల్లాలోని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇస్తారని సమాచారం. మంత్రివర్గ విస్తరణలో భాగంగా ప్రస్తుతం మంత్రుల్లో ఒకరిద్దరికి ఉద్వాసన ఖాయమని సమాచారం. పక్కకు తప్పించిన వారి స్థానంలో అదే సామాజిక వర్గంకు చెందిన ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటు కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు.. అందుకు హైకమాండ్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు.. మంత్రివర్గ విస్తరణలో భాగంగా ప్రస్తుత మంత్రుల శాఖల్లో భారీ మార్పులు జరిగే అవకాశం కూడా ఉన్నట్లు సమాచారం.

# గల్ఫ్ యుద్ధం.. భారత్ ఎలా తట్టుకుంటోందో తెలుసా?



గల్ఫ్ యుద్ధం కారణంగా అత్యంత ప్రభావితం అయ్యే దేశాల్లో భారత్ కూడా ఒకటి. మన దేశంలో చమురు, ఎల్‌పీజీ వినియోగం పెరిగిన కారణంగా మన గల్ఫ్ దేశాలపై ఆధారపడి ఉన్నాం. దీంతో మనం కూడా ప్రభావితం అవుతున్నాం. 90 శాతం చమురు, ఎల్‌పీసీ 60 శాతం, ఎల్ఎన్‌జీ 50 శాతం దిగుమతి చేసుకుంటున్నాం. పూర్తిగా గల్ఫ్‌గా, చమురు ఉత్పత్తి దేశాల్లో ఉద్రిక్తతలు నెలకొన్నా. బ్యాదల్ మాండెల్, ఆర్మూజ్ జలసంధిలో ఇబ్బందులు వచ్చినా ప్రభావితం అవుతున్నాం. కానీ తట్టుకుని నిలబడుతున్నాం.

**దిగుమతులే ఆధారం..**

భారత్ గల్ఫ్ దేశాల నుంచి 90% క్రూడ్ ఆయిల్, 60% ఎల్‌పీజీ, 50% ఎల్ఎన్‌జీ దిగుమతి చేస్తోంది, ఇది రోజువారీ వినియోగాన్ని 5 మిలియన్ బ్యారెళ్లకు చేర్చింది. బ్యాబ్ ఎల్ మండబ్, స్ట్రెయిట్ ఆఫ్ హార్మూజ్ జలసంధుల్లో దాడులు జరిగినా, రోజుకు 7-8 మిలియన్ బ్యారెళ్ల సరఫరా దెబ్బతింటుంది. ధరలు 20% పెరిగి బ్యారెల్‌కు 95 డాలర్లు దాటింది. దీని వల్ల దిగుమతి ఖర్చు వారానికి రూ.15 వేల కోట్లు పెరిగింది.

**ముందస్తు చర్యలతో స్థిరంగా..**

అయితే భారత్ ముందస్తున ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ఎక్కువ నిల్వలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 25 రోజులకు సరిపోయే క్రూడ్ నిల్వలు, ఎల్‌పీజీ 30 రోజులకు, పెట్రోల్, డీజిల్ 25 రోజులకు, ఎల్ఎన్‌జీ పది రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయి. వీటిని జాగ్రత్తగా వాడుకోవడం ద్వారా ప్రస్తుతం క్రైసిస్ నుంచి బయటపడే వీలు ఉంటుంది.

**వ్యూహాత్మక ప్రణాళికలు..**

భారత్ మూడు రకాలుగా ప్రయత్నం చేస్తోంది. వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందిస్తోంది. రష్యా నుంచి 30 బిలియన్ బ్యారెళ్ల ఇంధనం దిగుమతి చేసుకుంటున్నాం. అంగోలా నుంచి 3.4 మిలియన్ బ్యారెళ్లు, కాంగో నుంచి 1.3 మిలియన్ బ్యారెళ్ల ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నాం. వీటిద్వారా మనపై యుద్ధ ప్రభావం తగ్గించుకుంటున్నాం. ఒక దేశంపై ఆధారపడకుండా 40 దేశాల నుంచి చమురు కొంటున్నాం. ప్రస్తుతం యుద్ధం జరుగుతున్న గల్ఫ్ దేశాల నుంచి 70 శాతం చమురు ఆగిపోయింది. అయినా ఇబ్బంది లేదు. దౌత్యపరంగా ఇరాన్‌తో మాట్లాడడంతో మన ఓడలు సురక్షితంగా భారత్‌కు వస్తున్నాయి.

**స్ట్రాటజిక్ రిజర్వులు..**

మోదీ అదికారంలోకి వచ్చాక మన స్ట్రాటజిక్ రిజర్వులు పెంచేందుకు ఇండియన్ స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ లిమిటెడ్ అనే కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. దేశంలో మూడు ప్రాంతాల్లో చమురు నిల్వ చేస్తోంది. అండర్‌గ్రౌండ్‌లో పెద్ద ఎత్తున చమురు నిల్వలు చేస్తోంది. భూమి ఉపరితలం నుంచి 500 మీటర్ల లోపల స్టోరేజీ కెపాసిటీ ఉంది. 10 ఏళ్ల క్రితం విశాఖపట్టణంలో ఏర్పాటు చేశారు. తర్వాత తమిళనాడులోని పాదూర్‌లో రిజర్వులు ఏర్పాటు చేశారు. కర్ణాటకలోని మంగళూరులో కూడా నిర్వలు ఏర్పాటు చేశారు. విశాఖపట్టణంలో 60 మిలియన్ టన్నుల నిల్వల సామర్థ్యం ఉంది. మంగళూరులో 20 వేల టన్నులు, పాదూరులో కూడా 20 వేల టన్నులు నిల్వ సామర్థ్యం ఉంది.

**ఎల్‌పీజీకి ఇబ్బందులు..**

వార్షికంగా మనకు 31 మి.టి ఎల్‌పీజీ అవసరం ప్రస్తుతం 20% కొరత ఉన్నా, కమర్షియల్ (హోటల్స్, ఇండస్ట్రీలు) వాడకంపై 25% కోత పెట్టి 80% గృహావసరాలు (10 మి.టి.) రక్షించారు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చాక గ్యాస్ కనెక్షనుల గణనీయంగా ఇచ్చారు. ప్రస్తుతం 33 కోట్ల కనెక్షన్లు ఉన్నాయి. బాటలింగ్ స్టేషన్లు 23 మెట్రిక్ టన్నులకు పెంచారు. ఈ స్టేషన్లు 186 నుంచి 210కి పెంచాం. ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు 13 వేల నుంచి 25 వేలకు పెరిగారు. వాడకం పెరిగింది. అందుకు తగినట్లుగా ఉజ్వల్ యోజన కింద గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారు. ఒడిదుడుకులు ఉన్నా భారత్ తట్టుకుంటోంది. మిగతా దేశాలతో పోలిస్తే మనం ప్రభావితం కావడం లేదు. పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ మాత్రం తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. మోదీ ప్రభుత్వ ముందచూపు ఇప్పుడు మనల్ని సురక్షితంగా ఉంచింది.

# ఇరాన్ యుద్ధంలో ఉత్తర కొరియా జోక్యం



ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం మొదలై 19 రోజులైంది. ఇంతకాలం కొనసాగుతుందని ఎవరూ ఊహించలేదు. ఇంతలా ప్రతిఘటిస్తామని ఇరాన్, ఇంతకాలం యుద్ధం చేయాల్సి వస్తుందని అమెరికా కూడా అంచనా వేయలేదు. కానీ ఇరాన్ అమెరికాను భయపెడుతోంది. వ్యూహాత్మకంగా అమె రికాను దెబ్బతీస్తోంది. అమెరికాపై ఒత్తిడి తెస్తోంది. ఈ తరుణంలో హార్మూజ్ జలసంధి వద్ద నౌకలు నిలిచిపోయాయి. ఇలాంటి తరుణంలో యురోపియన్ యూనియన్ దేశాలకు చమురు సమస్య తలెత్తే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో అమెరికా యుద్ధంతో తమతో కలిసి రావాలని నాటో దేశాలను కోరింది. అయినా ఎవరూ ముందుకు రావడం లేదు.

**ఉత్తరకొరియా రంగంలోకి..**

ఈ వార్‌లోకి ఉత్తర కొరియా ఎంటర్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే యుద్ధం లక్ష్యం ఏమిటో ఎన్నాళ్లు కొనసాగుతుందో అమెరికా అంచనా వేయలేకపోతోంది. ఈ తరుణంలో ఉత్తర కొరియా రంగంలోకి దిగితే అమెరికాకు ఇబ్బందులు తప్పవు. ఎందుకంటే ఉత్తర కొరియా అణ్వాయుధ దేశం. దక్షిణ కొరియా అమెరికా మిత్ర దేశం దీనికి ఉత్తర కొరియాతో ఇబ్బందులు ఉన్నా అమెరికా ఆ దేశంపై దాడి చేయకపోవడానికి కారణం అణ్వాయుధమే.

**సరికొత్త ఆయుధాలతో ఇరాన్..**

యుద్ధం జరుగుతున్న వేళ ఇరాన్ 'డ్యాన్సింగ్ మిస్సైల్' ప్రయోగం (10 వేల కి.మీ. రేంజ్, అర్బిటల్ ట్రాజెక్టరీ)తో కొత్త ఆయుధాలు ప్రదర్శించి అమెరికా ఆధిక్యతను సవాల్ చేస్తోంది. ట్రంప్ అనుకోని ఈ దీర్ఘయుద్ధం ఖర్గ్ ఐలాండ్ దాడులు (అమెరికా చమురు మౌలిక సదుపాయాలపై)తో మరింత తీవ్రమైంది.

**ఇరాన్ ప్రతీకార దాడులు..**

మరోవైపు ఇరాన్ సౌదీ అరేబియాలోని అమెరికా ఎయిర్ బేస్‌లో 5 ట్యాంకర్ షిప్‌లు ధ్వంసం చేసి యుద్ధ విమానాల ఇంధన సరఫరా (గాల్లో నింపుదల) ఆపేశారు. ఈ ఆకస్మిక దాడి అమెరికా ఆపరేషన్ 'ఎపిక్ ఫ్యూరీ'ను ఆపేసి, విమానాలు లక్ష్యాలకు చేరుకోలేకపోయాయి. ఐఆర్‌జీసీ 5 వేల బాంబుల దాడులకు ప్రతిఘటనగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, మోజ్తాబా ఖమేనీపై బెదిరింకపత్రాలు జారీ చేసింది.

**ప్రచార యుద్ధం..**

## అమెరికాతో కలిసిరాని నాటో దేశాలు!

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వీడియో ఒకటి తాజాగా వైరల్ అవుతోంది. అందుతో నెతన్యాహు కుడి చేరితికి ఆరు వేళ్లు ఉన్నట్లు గుర్తించారు. దానిని వైరల్ చేస్తున్నారు. ఇది పూర్తిగా ఏఐ వీడియో అని పేర్కొంటున్నారు. ఇరాన్ దాడిలో నెతన్యాహు మరణించాడని సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. బతికే ఉన్నాడని ఇజ్రాయెల్ తెలిపింది. తాజాగా మరో రెండు వీడియోలను విడుదల చేసింది. మరోవైపు అమెరికా ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మోజ్తాబా ఖమేనీని చంపుతామంటోంది. నెతన్యాహును చంపుతామని ఐఆర్‌జీసీ ప్రకటించింది.

**నాటో మౌనం..**

ట్రంప్ తాజాగా 'ఇరాన్‌ను చితక్కొట్టాము' అని ప్రకటించి నాటో సహాయం కోరాడు, కానీ ఎవరూ స్పందించలేదు - కొందరు 'రామని' చెప్పారు. అమెరికా ట్రిలియన్ డాలర్ సైనిక బడ్జెట్‌కు ఉన్నప్పటికీ, 100 డ్రోన్ దాడికి 16 కోట్లక్షాలర్ల ఖర్చు అమెరికాపైఊ ఆర్థిక ఒత్తిడి సృష్టిస్తోంది. ఈ ఒంటరితనం అమెరికా వ్యూహాన్ని మార్చేస్తోంది. ఉత్తర కొరియా మద్దతుతో ఇరాన్ ఐఆర్‌జీసీ యుద్ధం దీర్ఘకాలం సాగేలా చూస్తున్నాయి. రష్యా, చైనా సహకారం (డ్రోన్‌లు, ఇంటెల్) పెరిగితే మహాయుద్ధంగా మారవచ్చు.

# కమ్యూనిస్టు రాజ్యంలో ప్రజాస్వామ్యం పరిస్థితి ఇదీ!



ఉత్తరకొరియా పేరు చెప్పగానే నియంత జోంగ్ ఉన్ కిమ్. అధ్యక్షుడిగా ఆయన దశాబ్దాలుగా పాలన సాగిస్తున్నాడు. ఇప్పుడు ఆయన వారసులు ఎవరనేదానిపై కిమ్ కుటుంబంలో గొడవ జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు కిమ్ ఇరాన్ యుద్ధంలోకి వస్తారన్న వార్తలు వస్తున్నాయి. ఈ తరుణంలో ఉత్తర కొరియాలో ఇటీవల ఎన్నికలు జరిగాయి. ఇవి కఠిన కమ్యూనిస్టు వ్యవస్థకు పరిపూర్ణ ఉదాహరణ. 99.99% ఓట్లతో ఒకే పార్టీ విజయం సాధించింది. ఇక్కడ పోటీ లేదు. కానీ ప్రజల మద్దతు తమకే ఉందని చెప్పుకోవడానికి ఈ ఎన్నికలు నిర్వహించారు.

**ఎన్నికల ప్రక్రియ ఇలా..**

ఈ ఎన్నికల్లో లేబర్ పార్టీ మాత్రమే పోటీ చేసింది. ఆ పార్టీ అభ్యర్థులే నిలబడ్డారు. ప్రతి స్థానానికి ఒకే అభ్యర్థి. ఇది 1948 నుంచి కొనసాగుతోంది. పోలింగ్ రోజు ఓటర్లు బూత్‌లకు వెళ్లి బ్యాలెట్ పేపర్ తీసుకుంటారు. ఇష్టం లేకపోతే అధికారుల ముందు క్రాస్ చేసి వేయాలి లేదా ఖాళీగా ఇవ్వాలి. తాజా ఎన్నికల్లో 99.99 శాతం మంది ఓటు వేశారు. మిగిలిన 0.001 ఓటర్లు విదేశాల్లో ఉన్నారు. కొందరు పడవల్లో ప్రయాణిస్తున్నారు. మరికొందరు అనారోగ్యంతో బాధపడుతున్నారు.

**తిరస్కరిస్తే అంతే..**

తమది ప్రజాస్వామ్యం అని చెప్పుకుంటున్న కిమ్.. ఓటు వేయడంలో మాత్రం స్వేచ్ఛ ఇవ్వలేదు. ఖాళీ బ్యాలెట్ లేదా క్రాస్ లేకుండా వేస్తే తిరస్కరణగా లెక్కించబడుతుంది. కానీ ఇది అరుదు. ప్రజలు భయం, సామాజిక ఒత్తిడి వల్ల మద్దతు చూపిస్తారు. ఓటు వేయకపోతే ఉద్యోగం, సామాజిక స్థితి ప్రభావితమవుతాయి. ఈ విధానం కిమ్ ఇల్-సుంగ్ (1948) నుంచి మొదలైంది. కిమ్ జాంగ్-ఇల్, కిమ్ జాంగ్-ఉన్ పాలనలో కొనసాగుతోంది. ప్రతీ ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికలు ప్రజాస్వామ్య రూపం కాదు, పాలకుల ఆధిపత్యాన్ని ధ్రువీకరించడం. ప్రచారం, భయం, ఆర్థిక ఆధారాలు కీలకం. ఇలాంటి వ్యవస్థలు క్యూబా, చైనాలో కొంత మార్పు కనిపిస్తుంది, కానీ ఉత్తర కొరియా అత్యంత కఠినం. ఫలితంగా, అధికార పార్టీ శాశ్వతంగా ఆధిపత్యం చెలాయిస్తుంది.

## ఉమ్మడి వరంగల్‌ను విస్మరించిన రాష్ట్ర బడ్జెట్

### -సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు-



హనుమకొండ, మార్చి 20 (పోలీస్ నిఘా) : రాష్ట్ర ప్రభుత్వం తరుపున శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో ఉమ్మడి వరంగల్ జిల్లాను విస్మరించారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ పై ఆయన స్పందిస్తూ రాష్ట్ర రాజధాని హైద రాబాద్ పై పెట్టిన శ్రద్ధ రాష్ట్ర రెండవ రాజధా నిగా హైదరాబాద్ కు దీటుగా వరంగల్ ను అభివృద్ధి చేస్తామని ప్రకటించినప్పటికీ వరంగల్ పై దృష్టి పెట్టలేదని తెలిపారు. వరంగల్ అభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపు, కొత్త ప్రాజెక్టులు,పరిశ్రమల ఊసే లేదని తెలిపారు. అలాగే దేవాదుల ఎత్తిపోతల పథకం సకాలంలో పూర్తి చేసేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించలేని, పేదల పెన్నిది అయిన వరంగల్ ఎంజీఎంకు అవసరమైన నిధులు కేటాయించలేదని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన నిరుద్యోగ భృతి అంశాన్ని ప్రస్తావించకుండా మరోసారి గత ప్రభుత్వాల మాదిరిగానే నిరుద్యోగులను మోసం చేశారని తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల అర్హులైన మహిళలకు రూ. 2500 వారి ఖాతాలో జమ చేస్తామన్న హామీ నెరవేర్చలేదని పేర్కొన్నారు. అలాగే రైతులను ఆదుకునేందుకు రైతు భరోసా సకాలంలో అందించడం లేదని తెలిపారు. వరంగల్ నగరంలోని మురికి వాడల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక బడ్జెట్‌లో లేదని తెలిపారు.

## శ్రీ భద్రకాళీ దేవస్థానములో శ్రీ భద్రకాళీ వసంత నవరాత్ర మహోత్సవములు



వరంగల్, మార్చి 20 (పోలీస్ నిఘా) : 19-03-2026 గురువారం నుండి 27-03-2026 శుక్రవారం వరకు అత్యంత వైభవోపేతముగా నిర్వహింపబడుతున్నాయి. వసంత నవరాత్రమహోత్సవములు ఈ రోజుతో రెండవ రోజుకు చేరుకున్నాయి. ఈ రెండవ రోజు కార్యక్రమములో భాగంగా ఉదయం సుప్రభాత సేవ, నిత్యాహ్నికం జరుపబడిన పిమ్మట అమ్మవారికి లక్ష లిల్లీ పూలతో లక్ష పుష్పార్చన నిర్వహించబడింది. ఈ కార్యక్రమం శ్రీ భద్రకాళి శేషు ఆధ్వర్యవమున ముఖ్య అర్చకులు శ్రీ వెంకటనాగరాజ శర్మలు వేద విద్యార్థులు నిర్వహించారు. ఈ రోజు లక్ష పుష్పార్చనకు ఉభయదాతలుగా వరంగల్ ప్రముఖ వ్యాపారి శ్రీ సురినేని నవీన్రావు, నీరజ దంపతులు వ్యవహరించారు. ఈ రోజు శుక్రవారం కూడా కావడంతో భక్తులు అమ్మవారి దర్శనమునకు పోటెత్తారు. ఈ వసంత నవరాత్రులలో అమ్మవారికి నిర్వహించు లక్ష పుష్పార్చన భక్తులు దర్శించుకొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కార్యనిర్వహణాధికారి శ్రీమతి రామల సునీత కోరారు. ఈ రోజు లక్షపుష్పార్చన కార్యక్రమంలో పాల్గొన్న ధర్మకర్తలు శ్రీ గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, శ్రీమతి గాండ్ల స్రవంతి, శ్రీ పాలడుగుల ఆంజనేయులు తదితరులు.

## యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ నంబర్ గా తుప్పతీ స్వప్న బీరప్ప



అడ్డగూడూరు, మార్చి 20 (పోలీస్ నిఘా) : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు తుప్పతీ స్వప్న బిరప్ప నూతనంగా విడుదల చేసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంలో ఎగ్జిక్యూటివ్ నెంబర్ గా తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు గారి సూచన మేరకు నియామకమైనారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ తుప్పతి స్వప్న బీరప్ప మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాకు నూతన బాధ్యతలు అప్పగించినా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ గారికి,తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు గారికి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి గారికి, డీసీసీ అధ్యక్షులు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తానని తెలియజేశారు. తన ఎన్నికకు సహకరించిన అడ్డగూడూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు, యాదాద్రి భువనగిరి జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## విద్యార్థులకు మెనూను తప్పక అమలు చేయాలి

### విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసిన అదనపు కలెక్టర్ నగేష్




మెదక్, మార్చి 20 (పోలీస్ నిఘా) : విద్యార్థులకు మెనూ ను తప్పక అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. శుక్రవారం టేక్మల్ మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించారు. ఆగ్రో సేవకేంద్రాన్ని ,గ్యాస్ గోదామును పరిశీలించారు. కేజీవీబీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేజీవీబీ పాఠశాలలో స్టోర్ రూమును,కిచెన్, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. కేజీవీబీ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెనూ తప్పక అమలు చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, ఉచిత విద్యా, అందించాలని తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆగ్రో సేవకేంద్రం లో పలు రికార్డులు, స్టాక్ వివరాలు పరిశీలించారురైతులకు అన్ని మందులు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, యూరియాను త్వరిత గతిన అందించాలన్నారు. గ్యాస్ వినియోగదారులు గ్యాస్ సమస్యపై చింతించాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా లో సరిపడ గ్యాస్ సిలిండర్లు ఉన్నాయన్నారు. గ్యాస్ సమస్యను సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



వరంగల్ జిల్లా / పర్వతగిరి, మార్చి 20 (పోలీస్ నిఘా) : వరంగల్ జిల్లాలోని పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి, వైద్య సేవల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్శనలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు కలెక్టర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రి లోని ఓపీ రిజిస్టర్, హాజరు నమోదు పుస్తకాలు, ఔషధ నిల్వలు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రత్యేకంగా ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. అలాగే ప్రజల్లో వివాహ వయస్సుపై అవగాహన కల్పించి బాల్య వివాహాలను నిరోధించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించేందుకు అవసరమైన అనుమతులు పొందిన అనంతరం వెంటనే వాటిని తొలగించాలని ఆదేశిం చారు. గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా పరిసరాల పరిశుభ్రతను నిరంతరం నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాల మేరకు సూచించిన పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను సమయానుకూలంగా సాధిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిదురు శంకర్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ రాజ్, డాక్టర్ మౌనిక, రెవెన్యూ, పంచాయతీరాజ్ మరియు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# 6 గ్యారంటీలకు పాడె కట్టే బడ్జెట్ ఇది

### తెలంగాణ బడ్జెట్‌పై బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్ స్పందన




వరంగల్, మార్చి 20 (పోలీస్ నిఘా) : మోసం...దగా...ప్రజా వంచన బడ్జెట్ ఇది వరంగల్ జిల్లాకు నయవంచన బడ్జెట్ ఎంజిఎం ఉసెత్తని బడ్జెట్. సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ కు రూపాయి కేటాయించలేదు అంకెల ఆర్భాటాలు... కేటాయింపుల ప్రగల్భాలే తప్ప ఒరిగేందేమీ లేదు వరంగల్ ను రెండవ రాజధాని చేస్తాం అని గొప్పలు చెప్పడం తప్ప ఆచరణలో శూన్యం కేంద్రంనిధులపై ఆధారపడటం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు ఆదాయాన్ని పండబెట్టి...అప్పుల కోసం అర్రుల చాచే బడ్జెట్ ఇది రాష్ట్రంపై మరో రూ.లక్ష కోట్లు అదనంగా అప్పు భారం మోపేందుకు కాంగ్రెస్ సిద్ధమవ్వడం సిగ్గు చేటు వరంగల్ ఎయిర్ పోర్ట్, టెక్స్ టైల్ పార్క్, హైవే రోడ్ల మాటలేదు. గ్రేటర్ వరంగల్ కు మరో సారి మొండిచేయ్యి రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించడంలో హ్యాట్రిక్ ('మూడో బడ్జెట్ ఇది) కొట్టిన కాంగ్రెస్ రైతు భరోసా పైసలు రెండు విడతలు ఎగ్గొట్టినట్లేనా? రూపాయ బిళ్ల కూడా ఇవ్వకుండా కౌలు రైతులు, వ్యవసాయ కూలీల నోట్లో మళ్లీ మట్టి కొట్టారు మహిళలను మళ్లీ వంచించారు...తులం బంగారం తుస్... రూ.2500లు నిల్ వృద్ధుల నోట్లో మట్టి కొట్టారు...రూ.4 వేల పెన్షన్ పెంపు ఊసే లేదు నిరుద్యోగులున్నారనే సోయే లేదు.... బడ్జెట్ లో నిరుద్యోగ భ్రుతి అంశమే లేదు విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు కదా.... రూపాయి బిళ్ల కేటాయించలే ఆరోగ్యశ్రీకి బడ్జెట్ కేటాయింపుల కంటే గత బకాయిలే ఎక్కువ విద్యకు 16 శాతం నిధులు కేటాయించాలని విద్యాశాఖ కమిషన్ ప్రతిపాదిస్తే...8 శాతానికే పరిమితం దేవాదాయ శాఖకు గత బడ్జెట్ లో రూ.190 కోట్లు కేటాయిస్తే... ఈసారి కేటాయింపుల ప్రస్తావనే లేదు 12 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు కంటి తుడుపు కేటాయింపులు... 56 శాతం బీసీ జనాభాకు 4 శాతం కేటాయింపులా?... ఎస్సీ, ఎస్టీలకు సైతం బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం చేశారు మైనారిటీలకు గతేడాదికంటే ఎక్కువ నిధులు కేటాయించడం విడ్డూరం రూ.లక్షల కోట్ల పెట్టబడులు తెచ్చామని ఆర్థిక మంత్రి చెప్పడం సిగ్గు చేటు దావోస్, గ్లోబల్ సమ్మిట్ పేరుతో వచ్చిన పెట్టుబడుల వివరాలు వెల్లడించే దమ్ముందా? రెండేళ్లలో దిగిపోయే ప్రభుత్వమే కదా?...అని ఇష్టారాజ్యంగా అప్పులు చేసేందుకు సిద్ధమయ్యారు వరంగల్ జిల్లాకు బడ్జెట్ లో మొండి చేయి ఇవ్వడంపై జిల్లా మంత్రి స్పందించాలి వరంగల్ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఎ మొఖం పెట్టుకొని బయట తిరుగుతారు కాంగ్రెస్ నేతలు గల్లీలో గప్పలు కొట్టడం తప్ప వరంగల్ కు రూపాయి తేలేదు.

# భక్త రామదాసు వంశీకుడు కంచెర్ల వెంకటరమణకు గణపతి సచ్చిదానంద స్వామి ఆశీర్వాదాలు



పటాన్ చెరు, మార్చి 20 (పోలీస్ నిఘా) : దుండిగల్ ఆశ్రమంలో శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిని భక్త రామదాసు వంశీకుడు కంచెర్ల వెంకటరమణ మర్యాదపూర్వకంగా దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాలు, అక్షింతలు మరియు భద్రాచల మహిమ గ్రంథాలను స్వామివారికి సమర్పించి పాదాభివందనాలు చేశారు. అనంతరం స్వామివారు "శతమానంభవతి" అంటూ ఆశీర్వదించారు. కంచెర్ల వెంకటరమణ మాట్లాడుతూ, భక్త రామదాసుగా ప్రసిద్ధి చెందిన కంచెర్ల గోపన్న 17వ శతాబ్దంలో ఖమ్మం జిల్లా నేలకొం డపల్లిలో జన్మించి, శ్రీ సీతారామచంద్ర స్వామిపై అపార భక్తితో ఆలయ నిర్మాణానికి కృషి చేసినట్లు వివరించారు. ఆయన భక్తి ప్రపత్తులకు గుర్తింపుగా "భక్త రామదాసు" అనే నామం పొందినట్లు తెలిపారు. తాను ఆయన 11వ తరానికి చెందిన వారసుడిగా జన్మించడం గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. తాను కూడా అదే మార్గంలో శ్రీ సీతారాముల సేవలో పాల్గొంటూ సమా జంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొం దించేందుకు కృషి చేస్తున్నానన్నారు. ఆల యాలలో హనుమాన్ చాలీసా పారాయ ణాలను నిర్వహిస్తూ, ప్రతి మంగళవారం, శనివారం 108 సార్లు పారాయణం జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా కొంతకాలం కొకసారి లక్ష పారాయణాలు నిర్వహించే కార్యక్రమాలను కూడా చేపడుతున్నట్లు చెప్పారు. ఆధ్యాత్మిక సేవలకు గాను కంచెర్ల వెంకటరమణకు దైవజ్ఞ శర్మ ప్రశంసా అవార్డు, తెలంగాణ భాషా సంస్కృతి శాఖ "శివనంది" అవార్డు, వీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ "రాష్ట్రీయ రత్న" అవార్డులు లభించాయి. గత కొన్ని సం వత్సరాలుగా భక్త రామదాసు వంశీకులను ఏకతాటిపైకి తీసుకురావడానికి నేలకొండపల్లిలో జరిగే వార్షిక ఉత్సవాలలో పాల్గొంటూ సేవలు అందిస్తున్నారు. భద్రాచలం, నేలకొండపల్లిలో భక్తుల కోసం సత్రాల నిర్మాణానికి సంకల్పించి కృషి కొనసాగిస్తున్నారు. అలాగే అయోధ్యలో శ్రీరామాలయ నిర్మాణానికి దాతల సహకారంతో వెండి ఇటుకలు, వెండి, బంగారంతో రూపొందించిన శంఖు, చక్రాలు మరియు వెండి పాదుకలను సమర్పించినట్లు తెలిపారు. భక్తి, సేవా కార్యక్రమాలను సంకల్పబలంతో ముందుకు తీసుకెళ్తున్నందుకు స్వామివారు అభినందించినట్లు కంచెర్ల వెంకటరమణ తెలిపారు.



## ఈద్గాల్లో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



హనుమకొండ, మార్చి 20 (పోలీస్ నిఘా) : పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని నగర పరిధిలోని ఈద్గాల్లో జరుగుతున్న ఏర్పాట్లను హన్మకొండ జిల్లా కలెక్టర్/గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నగరంలోని ఎల్‌బీ నగర్, మాట్వాడ, బొక్కలగడ్డ ప్రాంతాల్లో ఉన్న ఈద్గాలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, అక్కడ కొనసాగుతున్న శానిటేషన్, తాగునీరు, లైటింగ్, పార్కింగ్ తదితర ఏర్పాట్లను సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముస్లిం సోదరులు రంజాన్ సందర్భంగా ప్రార్థనలు ప్రశాంతంగా నిర్వహించుకునేలా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈద్గాల్లో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ, చెత్త తొలగింపు, శుభ్రపరిచే పనులను నిరంతరం కొనసాగించాలని సూచించారు. శానిటేషన్ మరియు ఇంజనీరింగ్ విభాగాలు సమన్వయంతో పని చేసి, ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. స్థానిక మత పెద్దలతో మాట్లాడి వారి సూచనలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, షామియానా, టెంట్లు, మంచినీటి, సౌండ్ సిస్టం తదితర అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సి.ఎం.హెచ్.ఓ డా. రాజారెడ్డి,ఈఈ లు రవి కుమార్, సంతోష్ బాబు, డీఈలు, ఏఈలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్‌కు వినతి పత్రం | బిజెపి ఆధ్వర్యం లో భారీ ర్యాలీ



కాజీపేట్,హన్మకొండ , మార్చి 20 (పోలీస్ నిఘా) : కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ సమస్యలు, డి.ఏ బకాయిల చెల్లింపులో ఆలస్యం, భూ భారతి సమస్యలు తదితర ప్రజా సమస్యలపై నిరసన వ్యక్తం చేశారు. బిజెపి హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న డా, కాళీ ప్రసాద్ రావు, కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ ను కలిసి పలు ప్రజా సమస్యలను వివరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు, కార్పొరేటర్లు, జిల్లా కమిటీ సభ్యులు, అనుబంధ మోర్చాల కమిటీ సభ్యులు, వివిధ మండల అధ్యక్షులు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో జూదంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఉక్కుపాదం

### నలుగురు అరెస్ట్ - ఇద్దరు పరారీలో..

### రూ.4,750 నగదు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం

### జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు వెల్లడి



మెదక్, మార్చి 20 (పోలీస్ నిఘా) : మెదక్ జిల్లా చిల్పిచేడ్ మండలం సిలంపల్లి గ్రామ శివారులోని డంప్‌యార్డు సమీపంలో అక్రమంగా జూదం ఆడుతున్న వారిపై టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించి నలుగురిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ బృందం సంఘటనా స్థలానికి చేరుకుని జూదం ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో వెంకటాపురం లక్ష్మణ్, జుకంటి లోకయ్య, మన్నె ప్రసాద్, యల్లయ్యగారి భూమ్ రెడ్డి ఉన్నారు. ఈ ఘటనలో రాకేష్, పెద్దొల్ల సుధాకర్ రెడ్డి పరారీలో ఉండగా, సంఘటనా స్థలం నుండి రూ.4,750 నగదు మరియు 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు చిల్పిచేడ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. జిల్లాలో ఎక్కడైనా జూద కార్యకలాపాలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.

## కల్తీ చేస్తే కఠిన చర్యలు: డీసీపీ గైక్వాడ్ వైభవ్



హైదరాబాద్, మార్చి 20 (పోలీస్ నిఘా) : నగరంలో పెరుగుతున్న ఆహార కల్తీని అరికట్టేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఇందుకోసం హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక బృందంలో 32 మంది టాస్క్ ఫోర్స్, లా అండ్ ఆర్డర్ సిబ్బంది ఉంటారని, వీరు జీహెచ్ఎంసీ ఫుడ్ ఇన్స్పెక్టర్లతో కలిసి నగరవ్యాప్తంగా జాయింట్ రైడ్స్ నిర్వహిస్తారని టాస్క్ ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ తెలిపారు. ముఖ్యంగా పాలు, నాన్-వెజ్ వంటి వాటిల్లో జరుగుతున్న కల్తీని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని, పదే పదే పట్టుబడిన వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని, దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కల్తీ ఆహారంపై సమాచారం ఉంటే 8712661212 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు.

# బిజెపి ఆధ్వర్యంలో ఆర్డీవోకి వినతి పత్రం



దేవరకొండ, మార్చి 20 (పోలీస్ నిఘా) : శుక్రవారం భారతీయ జనతా పార్టీ దేవరకొండ రూరల్ మండలం అధ్యక్షులు నేనావత్ రాము నాయక్ వారి ఆధ్వర్యంలో ఆర్డీవోకీ వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి సురేష్ జిల్లా ఉపాధ్యక్షులు వానం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నెరవేర్చలేని రాష్ట్ర ప్రభుత్వ హామీలను తక్షణమే అమలు చేయాలి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇవ్వడం జరిగింది కానీ వాటిలో ఏ ఒక్క హామీ ఇప్పటికి వరకు పూర్తిగా అమలు కాలేదు ముఖ్యంగా యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు మరియు దివాంగులకు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, పేదలకు గృహ నిర్మాణం పథకం రైతులకు రైతు భరోసా భూ సమస్యల పరిష్కారం వంటి అనేక హామీలు ఇప్పటివరకు కావడం లేదు ప్రభుత్వం మీద నమ్మకం పెట్టుకొని ఓటు వేసిన ప్రజలు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా సమయానికి అందకపోవడంతో రైతులు పెట్టు బడుల కోసం అప్పులపై ఆధార పడాల్సిన పరిస్థితి ఏర్పడింది అలాగే నివాస ఆదాయం మరియు కుల ధ్రువీకరణ పత్రాల జారిలో తీవ్ర జాప్యం జరుగుతుంది అనేక ప్రభుత్వ పథకాల కు ఈ పత్రాలు ఇంపార్టెంట్ కావడంతో నిర్ణయిత సమయంలో ధ్రువీకరణ పత్రాలు జారీ చేసి అర్హులు నష్టపోకుండా చూడాలని పై సమస్యలపై ప్రభుత్వం స్పందించి మండల పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుచున్నాము.

ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్, బిజెపి నల్లగొండ జిల్లా కౌన్సిల్ మెంబర్ గుండాల అంజయ్య, ఎస్టి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు అంజి నాయక్, బిజెపి జిల్లా నాయకులు జల్దా భాస్కర్, రెడ్డి శంకర్, జయ రాములు, కేలావత్ శంకర్ నాయక్, సిద్ధు, సముద్రాల సహదేవ్, ముసిని వెంకటేశ్వర్లు, అవ్వారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించిన కలెక్టర్ సత్య శారద



వరంగల్, మార్చి 20 (పోలీస్ నిఘా) : వరంగల్ జిల్లాలోని నర్సంపేట మార్కెట్ యార్డ్‌లో తెలంగాణ మార్క్‌ఫెడ్ మరియు నర్సంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు పండించిన మొక్కజొన్నకు సరైన ధర లభించేలా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను విక్రయించుకునేలా అన్ని సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించడంతో పాటు తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. మొక్కజొన్నలో తేమ శాతం (మాయిశ్చర్) 14 శాతానికి మించకుండా ఉండాలని తెలిపారు. క్వింటాల్‌కు రూ. 2400 ధర ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని సూచించారు. రైతులకు సమయానికి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మార్కెట్ యార్డ్‌లో తాగునీరు, విశ్రాంతి సదుపాయాలు, షెడ్లు వంటి మౌలిక వసతులు కల్పించి రైతులకు అనుకూల వాతావరణం ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, డిసిఓ నీరజ, డిఎం మార్క్ ఫెడ్ రంజిత్ రెడ్డి, ఆర్డీఓ ఉమారాణి, తహసీల్దార్ రవిచంద్ర రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ బడ్జెట్

**కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్**



చెన్నారావుపేట, మార్చి 20 (పోలీస్ నిఘా) : ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ బడ్జెట్ ప్రవేశ పెట్టారని కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు మరో శుభవార్త అందిస్తూ కొత్తగా 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు ప్రకటించడం పట్ల కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, ఇది సామాజిక భద్రతను మరింత బలపరుస్తుందని తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న చేయూత పథకం ద్వారా వృద్ధులకు, వితంతువులకు నెలకు రూ. 2,000 మరియు దివ్యాంగులకు రూ. 4,000 అందించడం కూడా ఎంతో ఉపయుక్తమని అన్నారు. ఈ పథకం కోసం భారీగా నిధులు కేటాయించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రజాహిత దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు. రాజీవ్ యువ శక్తి ద్వారా యువతని ప్రోత్సహించడం వారికి బడ్జెట్లో 6 వేల కోట్లు కేటాయిస్తూ సంచలన నిర్ణయం తీసుకుందని అన్నారు..ఎస్సి ఎస్టీ సంక్షేమానికి 20 వేల కోట్లు కేటాయించడం ప్రజా ప్రభుత్వానికి ఎస్సి ఎస్టీ ల అభి వృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా భూక్య గోపాల్ నాయక్ అన్నారు.. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క గారికి ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ఈ విధమైన సంక్షేమ చర్యలు సమాజంలో బలహీన వర్గాలకు గొప్ప ఊరటనివ్వనున్నాయని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో అమలు చేస్తున్న ప్రజా ఆమోదమైన పథకాలు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉన్నాయని కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ అన్నారు.

# జన్నారంలో తీరనున్న 'బహిరంగ' కష్టాలు

**కలెక్టర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం**



ఉమ్మడి ఆదిలాబాద్, మార్చి 20 (పోలీస్ నిఘా) : ఏళ్ల తరబడి జన్నారం మండల కేంద్రాన్ని వేధిస్తున్న పబ్లిక్ టాయిలెట్ల సమస్య ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. 'పోలీస్ నిఘా' దినపత్రికలో ప్రచురితమైన కథనం మరియు సామాజిక కార్యకర్త తుడుం జితేందర్ 'ప్రజావాణి'లో చేసిన ఫిర్యాదుపై జిల్లా యంత్రాంగం సీరియస్ గా స్పందించింది.

**అధికారుల 'భూమి' సాకు..**
**జితేందర్ ఆధారాల వేట**

మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి ప్రభుత్వ భూమి అందుబాటులో లేదని గతంలో అధికారులు చెప్పిన సాకులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ చంద్రయ్య తీవ్రంగా పరిగణించారు. అయితే, బస్టాండ్ సమీపంలోని ఇరిగేషన్ భూమితో పాటు, కవ్వాల్ చౌరస్తా వద్ద ఉన్న ప్రభుత్వ భూమి వివరాలను జితేందర్ ఆధారాలతో సహా కలెక్టర్ ముందు ఉంచారు. భూ ఆక్రమణలు జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించడంతో యంత్రాంగంలో చలనం మొదలైంది.

**రంగంలోకి యంత్రాంగం..**
**త్వరలోనే నిర్మాణాలు**

కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ క్రమంలో ఇరిగేషన్ డీఈఈ వెంకటేష్, స్థానిక సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్, మరియు పంచాయతీ కార్యదర్శి రాహుల్ స్పందించారు.

**ప్రస్తుత ప్రణాళికలు ఇవే:**

మొదటి విడత: అత్యంత రద్దీగా ఉండే బస్టాండ్ సమీపంలోని ఇరిగేషన్ స్థలంలో తక్షణమే పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తామని అధికారులు ప్రకటించారు.


రెండో విడత: బస్టాండ్ వద్ద పనులు పూర్తి కాగానే, కవ్వాల్ పాయింట్ మరియు ధర్మారం చౌరస్తాలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి అక్కడ కూడా మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

**మహిళలు, వ్యాపారులకు ఊరట**

ప్రతి మంగళవారం జరిగే వారపు సంతకు వచ్చే వేలాది మంది మహిళలు, విద్యార్థినులు మరియు చిరు వ్యాపారులు మరుగుదొడ్లు లేక నరకయాతన అనుభవిస్తున్నారు. తాజా నిర్ణయంతో పారిశుధ్యం మెరుగుపడటమే కాకుండా, మహిళల ఆత్మగౌరవం కాపాడబడుతుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

"కలెక్టర్ ఆదేశాలు కాగితాలకే పరిమితం కాకుండా, యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి. అప్పుడే జన్నారం ప్రజల ఏళ్ల నాటి కష్టాలు తీరుతాయి."

జన్నారంలో 'బహిరంగ' అవస్థలు


మహిళలు, వ్యాపారుల ఆవేదన పట్టించుకోని అధికారులు!

–తుడుం జితేందర్, పోలీస్ నిఘా: ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో & సామాజిక కార్యకర్త

# ఖమ్మం రహదారులకు మహర్దశ

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవ..**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేక కృషితో రూ.594 కోట్లు మంజూరు**

**జిల్లాలో ఐదు కీలక మార్గాల విస్తరణకు గ్రీన్ సిగ్నల్**

**నాలుగు వరుసల రోడ్లుగా ఆధునికీకరణ.. మారనున్న రవాణా ముఖచిత్రం**

**ఖమ్మం నుండి బోనకల్ రోడ్డు(28.3 కి.మీ) కు రూ.157.23 కోట్లు**







మధిర, మార్చి 20 (పోలీస్ నిఘా) : ఉగాది పండుగ పూట మధిర నియోజకవర్గ ప్రజలకు తీపి కబురు చెప్పిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసిన దెందుకూరు గ్రామ సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు.

ఖమ్మం జిల్లా వాసుల దశాబ్దాల కల నెరవేరబోతోంది. జిల్లా రవాణా వ్యవస్థలో సరికొత్త అధ్యాయం మొదలుకానుంది. మారుమూల గ్రామాల నుంచి పట్టణాలకు మహర్దశ కల్పిస్తూ, జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అసాధారణ చొరవ చూపారు. ఆయన పట్టుదలతో జిల్లాలోని ఐదు ప్రధాన రహదారుల విస్తరణకు (జీవో ఎంఎస్ 15 /16-03-2026) ఏకంగా రూ.594 కోట్ల భారీ నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో కీలక మార్గాలను నాలుగు వరుసల (ఫోర్ లేన్) రహదారులుగా అభివృద్ధి చేయనున్నారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచే జిల్లా అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ( హెచ్ ఏ ఎం ) పద్ధతిలో ఈ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంలో ఆయన పాత్ర కీలకం. ఈ రహదారుల వల్ల

గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు సౌకర్యవంతమైన రాకపోకలను కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాను సులభతరం చేయడం లక్ష్యంగా ఈ రహదారుల విస్తరణను ప్రభుత్వం చేపడుతోంది. ఈ రదారుల విస్తరణ వల్ల ఖమ్మం, వైరా, మధిర నియోజకవర్గంలో కనెక్టివిటీ పెరగడంతో పాటు స్థానికంగా ఆర్థిక వ్యవస్థకు ఊతం లభించనుంది. రవాణా ఖర్చులు తగ్గడంతో రైతులు, వ్యాపారులకు ప్రయోజనం చేకూరనుంది.

**రహదారులు విస్తరణ**

వైరా నుండి జగ్గయ్యపేట వరకు హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిని కలుపుతూ నాలుగు వరుసల రహదారిగా విస్తరణ.

జగ్గయ్యపేట, బోనకల్ , రావినూతల, ముజఫర్ నగర్, జానకీపురం, పెద్దబీరవల్లి, పాలడుగు, సీతానగరం, గొల్లపూడి, రెబ్బవరం, తాటిపూడి, జింకల తాండా. సోమవరం మీదుగా వైరా వరకు. ఈ రహదారి మొత్తం 25.2 కిలోమీటర్ల రహదారి విస్తరణకు రూ. 151.20 కోట్ల నిధుల మంజూరు. మధిర నుంచి తూటికుంట్ల వరకు నాలుగు వరుసల రహదారిగా విస్తరణ. మధిర, జిలుగుమాడు, ఆత్కూరు, కిష్టాపురం, సిరిపురం, కలకోట, బ్రాహ్మణపల్లి మీదుగా తూటికుంట్ల వరకు విస్తరణ. ఈ రహదారి మొత్తం 13.50 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణకు రూ. 81 కోట్ల నిధుల మంజూరు. మధిర నుంచి ఎర్రుపాలెం వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ. మధిర, ఎల్లెందుల పాడు, దెందుకూరు, మీనవోలు మీదుగా ఎర్రుపాలెం వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ. ఈ రహదారి మొత్తం 18.40 కిలోమీటర్ల మేర రూ. 110.40 కోట్ల నిధులు మంజూరు. ఖమ్మం నుంచి బోనకల్ వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ.

ఖమ్మం, కొత్తూరు, దంసలాపురం, గాంధీనగరం, రామకృష్ణాపురం, పందిళ్లపల్లి, జగన్నాథపురం, నాగులవంచ, ముష్టికుంట్ల మీదుగా బోనకల్ వరకు రహదారి విస్తరణ. మొత్తంగా 28.03 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణకు రూ. 157.23 కోట్ల నిధుల మంజూరు. బోనకల్–ఆళ్లపాడు, రాయన్నపేట–వంగవీడు వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ. బోనకల్, ఆళ్లపాడు, రాయన్న పేట మీదుగా వంగవీడు వరకు రహదారి విస్తరణ. మొత్తంగా 15.72 కిలోమీటర్ల మేర రహదారికి విస్తరణకు రూ. 94.32 కోట్ల నిధుల మంజూరు అయ్యాయి.

# పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు అనుమతి లేదు

**జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య**




సంగారెడ్డి, మార్చి 20 (పోలీస్ నిఘా) : జిల్లాలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య స్పష్టం చేశారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్షలను పారదర్శకంగా, కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చీఫ్ సూపరింటెండెంట్లు, ఎంఈఓలు, డిపార్ట్మెంటల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె దిశానిర్దేశం చేశారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎవరూ మొబైల్ ఫోన్లు తీసుకురావద్దని, కేంద్రంలో ఉన్న సిబ్బంది సహా ఎవరి వద్దా మొబైల్ ఫోన్లు ఉండకూడదని స్పష్టం చేశారు. పరీక్ష ప్రారంభానికి ముందు ప్రతి హాలును క్షుణ్ణంగా పరిశీలించి చూడాలని సూచించారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ కొనసాగుతున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి సంఘటనలు జరిగినా సంబంధిత చీఫ్ సూపరింటెండెంట్, ఎంఈఓలదే బాధ్యత అని స్పష్టం చేశారు. సబ్జెక్ట్ టీచర్లను క్లరికల్ సిబ్బందిగా ఉపయోగించినట్లయితే వారిని వెంటనే రిలీవ్ చేసి ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయులను నియమించాలని ఆదేశించారు. అకాల వర్షాల నేపథ్యంలో ప్రశ్నాపత్రాలు, ఆన్సర్ షీట్లను క్లోజ్డ్ వాహనాలలో సురక్షితంగా తరలించాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకొన్నారు.

# ప్రధాన రంగాలకు మొండి చేయి: బడ్జెట్‌పై సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

ఖమ్మం, మార్చి 20 (పోలీస్ నిఘా) : రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్లో ప్రధాన రంగాలకు మొండి చేయి చూపారని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ అంతగా దృష్టి సారించలేదని ఆయన తెలిపారు. విద్య, వ్యవసాయ రంగానికి సంబంధించి ప్రతి యేటా కనీస పెరుగుదల –నమోదు కావాలని పెరిగిన ఖర్చుల నేపథ్యంలో ఇలా జరగాల్సి ఉన్నా అది జరగ లేదని ఆయన అన్నారు. వ్యవసాయ రంగానికి –సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు జరిగే పరిస్థితి కనిపించడం లేదని సురేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పినట్లుగా సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఈ బడ్జెట్ తర్వాత ఖచ్చితంగా పింఛన్లు పెరుగుతాయని ప్రజలు ఆశించారని కానీ కేటాయింపులు చూస్తే పింఛన్ పెంపుదల లేదన్నారు. ఆర్టీసి, కాంట్రాక్ట్ కార్మికులు, అవుట్సోర్సింగ్ ఉద్యోగుల తదితర విషయాల్లో ఈ బడ్జెట్లో సరైన రీతిలో కేటాయిం పులు లేవన్నారు. అంకెలు గొప్పగా చెప్పినా, పది శాతం పెరిగిందని చెప్పినా నమ్మశక్యంగా లేదన్నా రు. రాష్ట్ర తలసరి ఆదాయం నాలుగు లక్షలు పైబడి చూపించారని కానీ అది వాస్తవానికి విరుద్దంగా ఉందని సురేష్ తెలిపారు.



# నెంబర్-1 స్థానంలో నిలపడమే ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రకటించారు. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు అల్పాహారం అందిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు అందచేస్తారు. ఐటీఐ, ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల ఉపకార వేతనం ఇస్తారు. రూ.73,383 కోట్ల కొత్త రుణాలకు ప్రతిపాదన చేపట్టారు. కేటాయింపులను పరిశీలిస్తే వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు, పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు, విద్యా శాఖకు రూ.26,674 కోట్లు, వైద్య శాఖకు రూ.13,679 కోట్లు, కార్మిక శాఖకు రూ.998 కోట్లు, మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు, పర్యాటక రంగానికి రూ.1,224 కోట్లు, ఎస్సీ సంక్షేమం రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమం రూ.7,934 కోట్లు, బీసీ సంక్షేమం రూ.12,511 కోట్లు, మైనార్టీ సంక్షేమం రూ.3,769 కోట్లు, కల్యాణ లక్ష్మి పథకం రూ.3,683 కోట్లు, ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు, యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ రూ.1500 కోట్లు, ఉస్మానియా యూనివర్సిటీ కి రూ.వెయ్యి కోట్లు, మెట్రో రైలు ఫేజ్-2 రూ.600 కోట్లు, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ పథకం రూ.723 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.1143 కోట్లు, గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు, వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్ రూ.3500 కోట్లు, మహాలక్ష్మి పథకం రూ.4,305 కోట్లు, ఇందిరమ్మ ఇళ్లు రూ.5,500 కోట్లు, చేయూత పథకం. రూ.14,861 కోట్లు, రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు, ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటయిస్తున్నట్లు భట్టి ప్రకటించారు. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ 1 స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు, రాజకీయ అడ్డంకులు ఎదురైనా వెనకడుగు వేయకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు.

**విద్యార్థులకు శుభవార్త : ఇంటర్‌లో బ్రేక్‌ఫాస్ట్ పథకం**

విద్యార్థులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. రాష్ట్రంలోని ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు అందరికి బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అందిస్తామని ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. బడ్జెట్‌లో ఈ ప్రతిపాదనలను ఉంచారు. అలాగే ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకుని వస్తున్నామన్నారు. ఈ పథకాలను 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నట్లు వివరించారు. శుక్రవారం తెలంగాణ అసెంబ్లీలో ఈ ఏడాది వార్షిక బడ్జెను ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన ఈ ప్రకటన చేశారు. దివ్యాంగ, శారీరక వైకల్య విద్యార్థులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్‌డ్ వాహనాల పంపిణీ చేస్తామని తెలిపారు. సంక్షేమ స్కూళ్లలో వసతుల మెరుగుకు చర్యలు చేపడతామన్నారు. అందుకోసం రూ.100 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 57 పాలిటెక్నిక్ కాలేజీలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్‌గా అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పాలిటెక్నిక్ కాలేజీల్లో 15 కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు. అలాగే స్కిల్ యూనివర్సిటీని విద్యా శాఖ పరిధిలోకి తీసుకు వస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు వారానికి మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగిజావతో కూడిన నాణ్యమైన అల్పాహారం అందిస్తారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సైతం ఇకపై మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిస్తారు. ??ష్ట్ర యువతకు విదేశాలలో సురక్షితమైన ఉపాధి, భాషా నైపుణ్యాలు, వీసా మార్గదర్శకత్వం అందించడానికి ఈ కొత్త ప్రోగ్రాం ప్రారంభిస్తారు. ఇంటర్మీడియట్ చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు 'రెట్రో ఫిటెడ్ మోటరైజ్డ్' వాహనాలను పంపిణీ చేయాలని నిర్ణయించారు.

**కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల బీమా**

ప్రజల కోసం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం తీసుకువస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఈ పథకం వల్ల రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ఈ పథకాన్ని జూన్ 2వ తేదీ నుంచి అమలు చేస్తామని ఆయన వివరించారు. 2026-27 వార్షిక బ్జడెట్‌ను శుక్రవారం అసెంబ్లీలో డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర వార్షిక బ్జడెట్ రూ. 3,24,234 కోట్ల అంచనాలతో రూపొందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల కోసం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల మేర ఈ బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లోని ఏఆర్‌సీఐలో రేర్ ఎర్త్ పర్మినెంట్ మ్యాగ్నెట్స్ తయారీ కోసం పైలట్ ప్లాంట్ ఏర్పాటు




హైదరాబాద్, మార్చి 20 (పోలీస్ నిఘా) : భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం పరిధిలోని స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ అయిన హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్(ఏఆర్‌సీఐ)లో Nd-Fe-B (నియోడైమియం-ఐరన్-బోరాన్) రేర్ ఎర్త్ పర్మినెంట్ మ్యాగ్నెట్స్ తయారీ కోసం ఒక పైలట్ ప్లాంట్ ఏర్పాటుచేశారు. ఈ పైలట్ ప్లాంట్‌ను భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం కార్యదర్శి ప్రొఫెసర్ అభయ్ కరాండికర్, ఏఆర్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ ఆర్. విజయ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం మాజీ కార్యదర్శి, ఏఆర్‌సీఐ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ అశుతోష్ శర్మ, మిధాని, మాజీ సీఎండీ, టెక్నికల్ రివ్యూ కమిటీ మెంబర్ డాక్టర్ ఎస్.కె.ఝా, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్(ఏఎన్ఆర్ఎఫ్) సీఈఓ డాక్టర్ శివకుమార్ కళ్యాణరామన్‌తో పాటు వివిధ పరిశ్రమలు, జాతీయ సంస్థల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. ఏఆర్‌సీఐలో ఏర్పాటుచేసిన ఈ ప్లాంట్ స్ట్రిప్-కాస్ట్ అల్లాయ్ నుంచి ఫినిష్డ్ సింటర్డ్ మాగ్నెట్స్ వరకు పూర్తి స్థాయి తయారీ విధానాన్ని అవలంబిస్తుంది. దృఢమైన, స్వయం సమృద్ధి కలిగిన తయారీ వ్యవస్థ అభివృద్ధికి వీలు కల్పిస్తుంది. అరుదైన ఖనిజాల రంగంలో స్వయం సమృద్ధిని సాధించడానికి, ప్రపంచ అరుదైన ఖనిజాల వాల్యూ చైన్‌లో భారతదేశ స్థానాన్ని బలోపేతం చేయడానికి ఈ పైలట్ ప్లాంట్ ఒక ముఖ్యమైన అడుగు. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు, ఎలక్ట్రానిక్స్, అధునాతన తయారీ సాంకేతికతలలో Nd-Fe-B అయస్కాంతాలు అత్యవసరమైన భాగాలు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ అభయ్ కరాండికర్ మాట్లాడుతూ.. ప్రపంచ సరఫరా గొలుసులో తలెత్తే లోపాలు, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ రంగాలలో భారతదేశంలో పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా అరుదైన ఖనిజాలలో వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని నిర్మించడంలో ఈ ప్లాంట్ ఒక ముఖ్యమైన అడుగు అని పేర్కొన్నారు. వికసిత్ భారత్-2047 దిశగా పయనిస్తున్న వేళ, వనరుల పరిమితులను అధిగమించడం, కీలక సాంకేతికతలలో స్వదేశీ సామర్థ్యాలను బలోపేతం చేయడం మన అభివృద్ధి వ్యూహంలో ప్రధానమని ఆయన అన్నారు. ఇలాంటి సదుపాయాల ఏర్పాటు ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించడమే కాకుండా, ఆటుపోట్లకు తట్టుకునే సామర్థ్యాన్ని, పోటీతత్వాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. సంస్థాగత విధానాలు, మిషన్-ఆధారిత కార్యక్రమాల ద్వారా పరిశోధనలను భారీ ఆవిష్కరణలుగా మార్చడానికి ఒక అనుకూలమైన వ్యవస్థను నిర్మిస్తున్నామని అన్నారు. సరికొత్త సాంకేతికతలలో భారతదేశాన్ని ప్రపంచ అగ్రగామిగా నిలబెట్టడంలో భాగస్వాములు కావాలని పరిశ్రమలు, అంకుర సంస్థలు, విద్యాసంస్థలను ప్రొఫెసర్ అభయ్ కరాండికర్ ఆహ్వానించారు. ప్రస్తుతం రేర్ ఎర్త్ మాగ్నెట్ సరఫరా గొలుసులు ప్రపంచవ్యాప్తంగా కేవలం కొన్ని చోట్ల మాత్రమే కేంద్రీకృతమై ఉన్నాయని, ఇది అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఇబ్బందికరంగా మారిందని గుర్తు చేశారు. ఖనిజాల నుంచి అయస్కాంతాల తయారీ వరకు వాల్యూ చైన్ అంతటా స్వదేశీ సామర్థ్యాలను స్థాపించడం వల్ల సరఫరా భద్రత, పోటీతత్వం, సాంకేతిక నాయకత్వం పెరుగుతాయని, ఖర్చు తగ్గుతుందని అన్నారు. సాంకేతికత ధ్రువీకరణ, సులభతర ప్రక్రియ, పరిశ్రమల సహకారం, ప్రదర్శన, స్వదేశీ ఆవిష్కరణలను వాణిజ్య తయారీ స్థాయికి తీసుకెళ్లడం, డీప్-టెక్ స్టార్టప్‌లు, ప్రైవేట్ రంగ భాగస్వామ్యానికి మద్దతు ఇవ్వడానికి ఈ పైలట్-స్కేల్ ప్లాంట్ ఒక కీలక వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఏఆర్‌సీఐ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ అశుతోష్ శర్మ మాట్లాడుతూ.. పరిశోధన స్థాయి నుంచి తయారీ స్థాయికి మారడమే ఈ పైలట్ ప్లాంట్‌ను నిజంగా విశిష్టమైనదిగా చేస్తుందని అన్నారు. దీనిలోని సరళత నిరంతర ఆవిష్కరణలకు, ప్రక్రియ ఆప్టిమైజేషన్‌కు, ఉత్పత్తి అభివృద్ధికి వీలు కల్పిస్తుందని పేర్కొన్నారు. ఏఎన్ఆర్ఎఫ్ సీఈఓ డాక్టర్ శివకుమార్ కళ్యాణరామన్ మాట్లాడుతూ.. భారతదేశపు ఈవీ వ్యవస్థతో సహా కీలక సాంకేతికతలను వేగవంతం చేయడానికి 'మిషన్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ హై-ఇంపాక్ట్ ఏరియాస్'(ఎంఏహెచ్ఏ) చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. అనువర్తిత పరిశోధనలలో చురుకుగా పాల్గొనవలసిందిగా ప్రైవేట్ రంగాన్ని ఆహ్వానించారు. ఏఆర్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ ఆర్. విజయ్ మాట్లాడుతూ.. అరుదైన ఖనిజాల వెలికితీత నుంచి అయస్కాంత తయారీ వరకు ఏఆర్‌సీఐ పూర్తిస్థాయి 'మినరల్-టు-మార్కెట్' వ్యవస్థను అభివృద్ధి చేస్తోందని, ఇది పరిశ్రమలతో అనుసంధానాన్ని బలోపేతం చేస్తుందని తెలిపారు. కాగా, ఈ పైలట్ ప్లాంట్ పరిశ్రమల భాగస్వామ్యాన్ని ప్రేరేపిస్తుందని, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుందని, స్వదేశీ అరుదైన ఖనిజ అయస్కాంతాల సాంకేతికతల వాణిజ్యీకరణకు మద్దతు ఇస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ఇది భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వ్యవస్థ, అధునాతన మెటీరియల్స్ తయారీ వృద్ధికి కూడా దోహదపడుతుంది. ఆత్మనిర్భర్ భారత్‌ను సాధించడానికి, వికసిత్ భారత్ 2047 సంకల్పాన్ని సాకారం చేసుకోవడానికి ఇది ఒక కీలక అడుగు.

# గోదావరిలో ఐదుగురు యువకుల గల్లంతు




భద్రాచలం, మార్చి 20 (పోలీస్ నిఘా) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పరిధిలో గోదావరి నదిలో జరిగిన విషాద ఘటనలో ఐదుగురు బీటెక్ విద్యార్థులు గల్లంతయ్యారు. గురువారం ఉగాది సెలవు సందర్భంగా స్నేహితులతో కలిసి వచ్చి సరదాగా నదిలో స్నానాలకు దిగారు. గోదావరిలో దిగిన సమయంలో స్నేహితులు ఫోటోలు దిగుతున్నారు. ఈ సమయంలో లోతును గమనించకపో వడంతో ప్రమాదం చోటుచేసుకుంది. అమరావతిలోని ఎస్ఆర్ఎంటీ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు భద్రాచలం ప్రాంతానికి చెందిన తమ మిత్రులు అభిరామ్, శ్రీకర్‌లతో కలిసి ఎటపాక మండలంలోని పురుషోత్తమపట్నం గ్రామ శివారులో ఉన్న కొల్లిగూడెం ఇసుక ర్యాంప్ సమీపంలోని గోదావరి నదిలోకి దిగారు. ఫోటోలు తీసుకుంటూ ఉండగా ఏడుగురు యువకులు అకస్మాత్తుగా ప్రవాహంలో కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరు ఈత రావడంతో ఒడ్డుకు చేరుకోగా మిగిలిన ఐదుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారిని అభిరామ్, శ్రీకర్, తేజ, సతీష్, నవదీప్‌లుగా గుర్తించారు. ఇందులో అభిరామ్, శ్రీకర్ భద్రాచలం ప్రాంతానికి చెందినవారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు ప్రారంభించారు. ప్రత్యేక రిస్క్యూ బృందం మృతదేహాల కోసం గాలింపు చర్యలు చేపట్టింది. శుక్రవారం సాయంత్రం మూడు మృతదేహాలను గజ ఈతగాళ్లు కనుగొన్నారు. వీరిని ఒడ్డుకు చేర్చారు. మృతిచెందిన తమ బిడ్డలను చూసి తల్లిదండ్రులు, బంధువులు గోదావరి నది ఒడ్డున భోరున విలపిస్తున్నారు. లభ్యమైన మృతదేహాల్లో భద్రాచలానికి చెందిన శ్రీకర్, అభిరామ్, ఉయ్యూరు కు చెందిన నవదీప్ మృతదేహాలు లభ్యమయ్యాయి.

## బాకీ కార్డులతో గన్‌పార్కు వద్ద బీఆర్ఎస్ నిరసన




హైదరాబాద్, మార్చి 20 (పోలీస్ నిఘా) : కాంగ్రెస్ ప్రభుత్వ హామీల వైఫల్యంపై గన్ పార్క్ వద్ద భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు ప్లకార్డులతో శుక్రవారం నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన బాకీ కార్డులు ప్రదర్శిస్తూ ప్రజలను మోసం చేసిన విధానాన్ని బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు ఎండగట్టారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావుతోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ నిరసనలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా తెలంగాణను ఆగం చేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. దివ్యాంగులకు బాకీ పడ్డ రూ.54,000 ఎక్కడ అని నిలదీశారు. నిరుద్యోగులకు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడ? నిరుద్యోగ భృతి ఏమైంది? అంటూ ప్రశ్నించారు. ఆటో డ్రైవర్లకు ఇస్తామని చెప్పిన రూ.24,000లలో సంవత్సరానికి రూ.12,000 చొప్పున రెండు సంవత్సరాలుగా బాకీ ఉందని విమర్శించారు. వృద్ధులకు ఇవ్వాల్సిన నెలకు రూ.4,000 చొప్పున మొత్తం రూ.54,000 బాకీ ఎక్కడ అని నిలదీశారు. పేదింటి ఆడబిడ్డలకు ఇస్తామని చెప్పిన తులం బంగారం ఏమైందని అడిగారు. రాష్ట్ర సంపదను దోచుకుంటూ రాష్ట్ర ప్రజలను గాలికి వదిలేసిందని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.




## ఫెయిల్డ్, ఫాల్స్, ఫ్యాన్సీ బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

ఇంకా ప్రతి రైతుకు ఇంకా సుమారు ఎకరాకు రూ.45,000కి పైగా బాకీపడి ఎగ్గొట్టారని విమర్శించారు. రూ.4000 నిరుద్యోగ భృతి కానీ, మహిళలకు ఇస్తా మన్న రూ.2500 ఆర్థిక సాయం గురించి కానీ ఈ బడ్జెట్‌లో ఎక్కడా లేదన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు సంబంధించి ఈ బడ్జెట్‌లో చోటు లేకపోవడం ప్రజలను వంచించడమేనన్నారు. కాంగ్రెస్ సర్కారు మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లను కూలగొట్టడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ ప్రాజెక్ట్ వ్యయం రెండు రోజుల్లోనే రూ. 5000 కోట్ల నుండి రూ.7000 కోట్లకు ఎలా పెరిగిందని నిలదీశారు. ఇదంతా ఒక ప్లానింగ్ లేని విధానమని, కేవలం దోచుకోవడానికేనని ఆరోపించారు. దేవాలయాల విషయంలో కూడా ప్రభుత్వం వివక్ష చూపుతోందని రామచందర్ రావు విమర్శించారు.

## జిల్లాలో మహిళా శిశు సంక్షేమ కార్యక్రమాలను
# పటిష్టంగా అమలు చేయాలి: కలెక్టర్



హనుమకొండ, మార్చి 20 (పోలీస్ నిఘా) : జిల్లాలో మహిళా శిశు దివ్యాంగులు వయో వృద్ధుల సంక్షేమ శాఖ పథకాలు, కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మహిళా శిశు సంక్షేమ శాఖ అభివృద్ధి, వివిధ కార్యక్రమాల అమలు తీరుపై ఆ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, అక్షయ పాత్ర భోజనం, పోషణ్ అభియాన్, పౌష్టిక ఆహారం,భేటీ బచావో.. భేటీ పడావో, అభివృద్ధి పనులు, తదితర అంశాలను ఇంఛార్జి జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, ఆయా విభాగాల అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ లోప పోషణ ఉన్న సామ్, మామ్ చిన్నారుల పట్ల ఆరోగ్యవంతంగా, బరువు పెరిగేవిధంగా మహిళా శిశు సంక్షేమ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల భవనాలు ఎక్కడైనా బాగాలేకపోతే స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లోకి మార్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. జిల్లాలో బాల్యవివాహాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. బాలలకు సంబంధించి ఫిర్యాదుల కోసం ఉన్న చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098గురించి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. బాల్య వివాహాల నిలుపుదల/నిర్మూలనపై ఈ నెల 26 న పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బాలల పరిరక్షణ విభాగం అధికారులు హాజరై బాల్య వివాహాల నిర్మూలనకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా సఖీ కేంద్రం సేవలను గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. భేటీ బచావో భేటి పడావో కార్యక్రమానికి సంబంధించి కార్యాచరణను సిద్ధం చేయాలని సూచించారు. దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ కు వివరించారు.

ఈ సమావేశంలో సీడీపీవోలు స్వరూప, ఉమా, ఎక్స్టెన్షన్ ఆఫీసర్ సింధురాణి, ఇంచార్జి డీసీపీవో ప్రవీణ్ కుమార్, ఎఫ్ఆర్ వో రవికృష్ణ, సఖీ కేంద్రం అడ్మిన్ హైమావతి, శిశు గృహ మేనేజర్ మాధవి, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ భాస్కర్, డీహెచ్ డబ్ల్యూ కో ఆర్డినేటర్ కళ్యాణి, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# కవ్వాల్‌లో ఘనంగా 'ఈద్ కా తోఫా' పంపిణీ

**నిరుపేద ముస్లింలకు ప్రభుత్వం అండ**







ఉమ్మడి అదిలాబాద్, మార్చి 20 (పోలీస్ నిఘా) : ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగను పురస్కరించుకుని, ప్రభుత్వం పంపిణీ చేస్తున్న 'ఈద్ కా తోఫా' కార్యక్రమం మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కవ్వాల్ గ్రామంలో అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక మజీద్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుకలను అందజేశారు.

**ఎమ్మెల్యే ఆదేశాలతో పంపిణీ**

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అధికారులు సమన్వయంతో ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పండుగ వేళ ముస్లిం సోదరులందరూ సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వారు గుర్తు చేశారు.

**అధికారుల శుభాకాంక్షలు**

జన్నారం ఎంపీడీవో ఉమర్ షరీఫ్, తహసీల్దార్ రామ్మోహన్ స్వయంగా ముస్లిం సోదరులకు కిట్లను అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ: ప్రతి ముస్లిం కుటుంబం రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కానుకలను అందిస్తోంది. నిరుపేదలకు అండగా ఉండటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత. ఈ కిట్లు పండుగ పూట పేద కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తాయి.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ముస్లిం మైనార్టీ పెద్దలు, మజీద్ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ తోఫా పట్ల స్థానిక ముస్లిం సోదరులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## కొల్లూర్ కెసిఆర్ డబుల్ బెడ్ రూమ్ ఆవరణలో ఇఫ్తార్ విందును ఏర్పాటుచేసిన మాజీ కౌన్సిలర్ భరత్



పటాన్ చెరు, మార్చి 20 (పోలీస్ నిఘా) : సంగారెడ్డి జిల్లా,పతాన్ చెరువు నియోజకవర్గం తెల్లాపూర్ డివిజన్ పరిధిలో కొల్లూరు కేసీఆర్ డబుల్ బెడ్ రూమ్ ఆవరణలో ఒరిగేమాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమని ఘనంగా నిర్వహించారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ విందులో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరస్పర సౌహార్దం, ఐక్యత, సోదరభావం ప్రతిబింబించాయి. ఈ కార్యక్రమానికి చిన్న శ్రీశైలం యాదవ్, కాటా శ్రీనివాస్ గౌడ్, రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సీపీ రెడ్డి గౌరవ అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని మరింత విశిష్టంగా నిలిపారు. వారు పరస్పర గౌరవం, సామాజిక ఐక్యతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అందరి సమిష్టి సహకారం, విస్తృతంగా పాల్గొనడం వల్ల ఇఫ్తార్ విందు విజయవంతంగా పూర్తయ్యింది.

## రామచంద్రపురం ఈద్గాలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసిన ఈశ్వర్ సింగ్, నరేష్ ముదిరాజ్





పటాన్ చెరు, మార్చి 20 (పోలీస్ నిఘా) : సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం,రామచంద్రపురం రంజాన్ సందర్భంగా రామచంద్రపురం పట్టణంలోని ఈద్గాలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసిన పట్టణ అధ్యక్షుడు ఈశ్వర్ సింగ్, మరియు కాంగ్రెస్ నాయకుడు నరేష్ ముదిరాజ్, ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ పుష్ప నాగేశ్ యాదవ్, పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ హాజరై ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కులమతాలకు అతీతంగా ప్రతి పండుగను కలిసి జరుపుకోవడం మంచి సంప్రదాయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివానందం, సుధాకర్ యాదవ్, శశిధర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రాజిరెడ్డి, ముస్లిం పెద్దలు అభిబ్ జానీ, అబ్దుల్లా హమీద్ పాల్గొన్నారు.

## ఎం.కె.ఆర్ కళాశాలలో సంప్రదాయ ఉగాది వేడుకలు




దేవరకొండ, మార్చి 20 (పోలీస్ నిఘా) : మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్), దేవరకొండలో శ్రీ పరాభవ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని తెలుగు విభాగం ఆధ్వర్యం లో ఘనంగా ఉగాది ఉత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమావత్ రవి మాట్లాడుతూ... షడ్రుచులు కలగలిసిన ఉగాది పచ్చడి లాగే మన జీవితం కూడా అనేక ఆటుపోట్లతో సుఖదుఖాలతో ఉంటుందని వాటన్నిటిని సమపాలలో సమన్వయించుకొని ముందుకు సాగిపోతూ అనుకున్న లక్ష్యాలని సాధించాలని విద్యార్థులకు సూచించారు. తదనంతరం కళాశాలలో ఏర్పాటుచేసిన ఉగాది పచ్చడిని సిబ్బందికి మరియు విద్యార్థులందరికీ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్డ తెలుగు శాఖ అధ్యక్షులు జి.కోటయ్య అకాడమిక్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య, సి ఓ ఈ జి. లింగారెడ్డి, తెలుగు అధ్యాపకులు ఏ.శ్రీను తదితర అధ్యాపకులు అధ్యాపకేతరులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.





## సమ్మర్ రేసులో హీరోయిన్ల సందడి!




ఒకప్పుడు వేసవి వచ్చిందంటే బాక్సాఫీస్ వద్ద సందడి మామూలుగా ఉండేది కాదు. కానీ నేడు సన్నివేశం అందకు భిన్నంగా కనిపిస్తుంది. కొత్త సినిమా రిలీజ్ లు తగ్గిపోవడంతో హడావుడి తగ్గింది. అయితే సినిమా అనేది ఎప్పుడు రిలీజ్ అయినా హీరోలతో పాటు హీరోయిన్లు కూడా పోటీలో కనిపిస్తుంటారు. ఈసారి సమ్మర్ రేసులో హీరోయిన్ల మధ్య కూడా గట్టి పోటీ నెలకొంది. తమ కెరీర్‌ను మలుపు తిప్పే కీలక చిత్రాలతో పలువురు ముద్దుగుమ్మలు ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ముఖ్యంగా మృణాల్ ఠాకూర్, నభా నటేష్, సంయుక్త మీనన్ , భాగ్యశ్రీ బోర్సే వంటి భామలకు ఈ సీజన్ అత్యంత కీలకంగా మారింది. టాలీవుడ్ సీతమ్మ మృణాల్ ఠాకూర్ యువ హీరో అడవి శేష్‌తో కలిసి నటిస్తోన్న 'డెకాయిట్' ఏప్రిల్ 10న విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటి వరకు క్లాస్ , ఎమోషనల్ పాత్రల్లో మెప్పించిన మృణాల్ ఈ చిత్రంలో కాస్త రఫ్ అండ్ టఫ్ రోల్‌లో కనిపించబోతున్నట్లు సమాచారం. అడవి శేష్ మార్క్ యాక్షన్ థ్రిల్లర్ కావడంతో ఈ సినిమా సక్సెస్ మృణాల్‌ను కమర్షియల్ యాక్షన్ జోనర్‌లో కూడా టాప్ హీరోయిన్‌గా నిలబెడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అదే జరిగితే మృణాల్ ఖాతాలో మరో భారీ విజయం నమోదైనట్లే. పాత్రల విషయంలో ఎంతో సెలక్టివ్ గా ఉండే అమ్మడు ఫార్ములా మరోసారి సక్సెస్ అయినట్లే. నిఖిల్ హీరోగా అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న పీరియాడిక్ డ్రామా 'స్వయంభు'. ఈ సినిమాలో ఇద్దరు క్రేజీ హీరోయిన్లు నభా నటేష్ – సంయుక్తా మీనన్ నటిస్తున్నారు. చాలా కాలం తర్వాత నభా నటేష్ ఓ భారీ ప్రాజెక్టుతో స్క్రీన్‌పై మెరుస్తున్నారు. సంయుక్త మీనన్ గోల్డెన్ లెగ్ సెంటిమెంట్‌ను మరోసారి ప్రూవ్ చేసుకోవాలని చూస్తోంది. ఈ సోషియో ఫాంటసీ చిత్రం ఇద్దరు భామల కెరీర్‌కు మైలేజ్ ఇచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా నభానటేష్‌కి ఈ సినిమా విజయం అన్నది అత్యంత కీలకం. ఇప్పటికే అవకాశాలు లేక ఖాళీగా ఉంటుంది. 'స్వయంభు' రూపంలో అమ్మడికిది కెరీర్ టర్నింగ్ అవకాశం అనే చెప్పాలి. ఈ సినిమా ఫలితం ఏమాత్రం అటు ఇటూ అయినా టాలీవుడ్ లో మరో ఛాన్స్ కష్టమనే చెప్పాలి. ఇదే సమ్మర్ రేసులో అందరి దృష్టిని ఎక్కువగా ఆకర్షిస్తుంది భాగ్యశ్రీ బోర్సే. అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తోన్న 'లెనిన్' చిత్రంలో అమ్మడు హీరోయిన్‌గా నటిస్తోంది. భాగ్యశ్రీకి టాలీవుడ్‌లో ఇప్పటి వరకు సరైన కమర్షియల్ బ్రేక్ దక్కని సంగతి తెలిసిందే. నటించిన సినిమాలన్నీ ఫ్లాప్ అవ్వడంతో కెరీర్ డైలమాలో పడే పరిస్థితికి వచ్చేసింది. ఈ సినిమా హిట్ అయితేనే టాలీవుడ్‌లో ఛాన్సులు రానున్నాయి. భాగ్య శ్రీ సైతం ఈ ప్రాజెక్టుపై భారీ ఆశలు పెట్టుకుంది. ఈ వేసవి బాక్సాఫీస్ వద్ద కేవలం వసూళ్ల యుద్ధమే కాదు. హీరోయిన్ల ఉనికి కోసం జరుగుతున్న పోరాటం కూడా. వీరిలో ఎవరు సమ్మర్ క్వీన్‌గా నిలుస్తారో? తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

## న్యూ ఏజ్ డైరెక్టర్‌తో యంగ్ హీరో సినిమా



టాలీవుడ్‌లో యంగ్ హీరోలలో ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకుంటున్న పంజా వైష్ణవ్ తేజ్ ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచారు. ఈసారి ఆయన గురించి వస్తున్న వార్తలు ఒక కొత్త ప్రాజెక్ట్‌కు సంబంధించినవిగా ఉండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం వైష్ణవ్ తేజ్, డైరెక్టర్ నంద కిషోర్ ఈమానితో కలిసి ఒక సినిమా చేయడానికి చర్చలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ ప్రారంభ దశలోనే ఉండగా, అధికారిక ప్రకటన మాత్రం ఇంకా వెలువడలేదు. అయినప్పటికీ ఈ కాంబినేషన్ గురించిన చర్చలు ఇప్పటికే సినీ వర్గాల్లో మరియు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. వైష్ణవ్ తేజ్ తన మొదటి సినిమా ఉప్పెనతో భారీ విజయాన్ని అందుకుని టాలీవుడ్‌లో బలమైన ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ సినిమా సక్సెస్ తరువాత, ఆయన ఒకే తరహా కథలకు పరిమితం కాకుండా, విభిన్న కథాంశాలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేకమైన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. కథలో కొత్తదనం ఉండటం, పాత్రలో వైవిధ్యం ఉండటం లాంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుంటూ, యాక్టర్ గా తన మార్కెట్ ను విస్తరించడానికి ప్రయత్నిస్తున్నారు. రీసెంట్ గా వైష్ణవ్ తేజ్ తన స్టైలిష్ ఫోటోషూట్‌తో కూడా సోషల్ మీడియాలో చర్చకు దారి తీశారు. వింటేజ్ లుక్‌లో మీసంతో, సింపుల్ స్టైలింగ్‌తో కనిపించిన ఆయన ఫోటోలు అభిమానులను ఆకట్టుకున్నాయి. ఈ కొత్త లుక్ కూడా ఆయనలోని మరో కోణాన్ని బయటపెట్టిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇక డైరెక్టర్ నంద కిషోర్ ఈమాని విషయానికొస్తే, ఆయన తెరకెక్కించిన 35 చిన్న కథ కాదు సినిమా మంచి ప్రశంసలు అందుకుంది. కథను సరళంగా, హృద్యంగా చెప్పే శైలి ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. ప్రేక్షకులను ఆలోచింపజేసే కథలను ఎంచుకోవడంలో ఆయన చూపుతున్న ఆసక్తి, కొత్త తరహా డైరెక్టర్ గా ఆయనను నిలబెట్టింది. ఈ నేపథ్యంలో వైష్ణవ్ తేజ్– నంద కిషోర్ ఈమాని కాంబినేషన్ నిజమైతే, అది టాలీవుడ్‌లో ఒక ఆసక్తికరమైన కలయికగా మారే అవకాశముంది. ప్రయోగాత్మక పాత్రలను ఎంచుకునే యంగ్ హీరో, కొత్త కథలతో ముందుకు వచ్చే డైరెక్టర్ కలిసి పనిచేస్తే, ఆడియన్స్ కు కొత్త అనుభూతిని అందించే సినిమా వచ్చే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. అయితే ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన కోసం అందరూ ఎదురుచూస్తున్నారు. కథ, జానర్, ఇతర నటీనటుల వివరాలు బయటకు రావాల్సి ఉంది. ఈ ప్రాజెక్ట్ కేవలం చర్చల దశలో ఉన్నప్పటికీ, ఇప్పటికే ఇది టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారడం విశేషం. త్వరలోనే ఈ కాంబినేషన్‌పై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

## ఆది సాయికుమార్ 'ఇగో రాజా'




టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో ఆది సాయి కుమార్ మరోసారి మాస్ అవతార్ లో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన లీడ్ రోల్ లో నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఇగో రాజా నుంచి విడుదలైన పోస్టర్.. ఆడియన్స్ లో ఆసక్తి రేకెతిస్తోంది. తెలుగు– తమిళ ద్విభాషా చిత్రంగా రూపొందుతున్న ఆ సినిమాను నిర్మాత జి. సురేష్ తన ఎస్‌జీఎస్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. గురు సరవణన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేసిన ఆ పోస్టర్ లో ఆది సాయి కుమార్ ఫియర్ ఫుల్ లుక్ లో కనిపించారు. లుంగీ ధరించి, సిగరెట్ తాగుతూ విలన్స్ వైపు స్ట్రాంగ్ గా చూసే తీరు సినిమాలో యాక్షన్ డోస్ ఏ రేంజ్ లో ఉండబోతుందో క్లియర్ గా చెబుతోంది. ప్రస్తుతం ఇగో రాజా పోస్టర్ సోషల్ మీడియాలో అందరినీ ఆకట్టుకుంటూ.. సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఇక సోషల్ మీడియాలో మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ కూడా మెప్పిస్తోంది. "ఉగాది సందర్భంగా ఇగో రాజా నుంచి ప్రత్యేక పోస్టర్ విడుదల చేస్తున్నాం. ఆది తన కెరీర్ లోనే అత్యంత అగ్రెసివ్ అవతార్ లో కనిపించనున్నారు. ఆ సినిమా యాక్షన్, ఎమోషన్, మాస్ ఎలిమెంట్స్ తో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది" అని పేర్కొంది. ప్రస్తుతం ఇగో రాజా మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే సినిమాలో తమిళ నటుడు సతీష్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటి వరకు సపోర్టింగ్ రోల్స్ తో గుర్తింపు తెచ్చుకున్న సతీష్, ఇటీవల ప్రధాన పాత్రల్లో కూడా మెప్పిస్తున్నారు. ఇగో రాజాలో ఆయన హై–వోల్టేజ్ యాక్షన్ పాత్రలో కనిపించనుండటం విశేషం. ఇద్దరు ప్రధాన పాత్రల మధ్య సాగే కథ, యాక్షన్– ఎమోషన్ ఎలిమెంట్స్ తో ప్రేక్షకులను ఆకట్టుకునేలా తెరకెక్కిస్తున్నారు. దర్శకుడు గురు సరవణన్, ప్రముఖ దర్శకుడు కె.ఎస్. రవికుమార్ వద్ద అసిస్టెంట్ గా పనిచేశారు. ఆయన తొలి చిత్రం కూగుల్ కుట్టప్ప విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు ఇగో రాజాతో మరింత ప్రేక్షకులను ఆకట్టుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది ఆయనకు మూడో చిత్రం కావడం గమనార్హం. అదే సమయంలో శంభాల విజయంతో మంచి ఫామ్ లో ఉన్నారు ఆది. ఇప్పుడు ఇగో రాజా చిత్రంతో కోలీవుడ్ లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నారు. ఇది ఆయనకు తొలి తమిళ చిత్రం కావడం విశేషం. రెండు భాషల్లోనూ విడుదలయ్యే ఆ సినిమా ఆయన కెరీర్ కు కీలకమయ్యే అవకాశం ఉంది. అదే సమయంలో ఇగో రాజా టెక్నికల్ టీమ్ కూడా స్ట్రాంగ్ గా ఉంది. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ మనోజ్ పరమహంస వర్క్ చేస్తుండగా, గిబ్రాన్ సంగీతం అందిస్తున్నారు. ఏదేమైనా ఉగాది కానుకగా విడుదలైన పోస్టర్ తోనే హైప్ క్రియేట్ అవ్వగా.. ఇగో రాజా మూవీ ఎలాంటి హిట్ అవుతుందో అంతా వేచి చూడాలి.

## నీలగా కొత్త ప్రయాణం...



తెలుగు చిత్ర పరిశ్రమలో స్టార్ హీరోయిన్ గా నీరాజనాలు అందుకున్న అనుష్క శెట్టి సరిహద్దులు దాటి మాలీవుడ్‌లో అడుగుపెడుతోన్న సంగతి తెలిసిందే. జయసూర్య కథానాయకుడిగా నటిస్తోన్న 'కథనార్: ది వైల్డ్ సోర్సెరర్' చిత్రంలో అనుష్క నీల అనే పవర్‌ఫుల్ విలన్ పాత్రను పోషిచండం టాలీవుడ్‌లోనూ పెద్ద చర్చకు దారితీసింది. ఈ ప్రయాణం టాలీవుడ్ కి పూర్తి భిన్నమైంది. తెలుగు లో బిజీగా ఉన్నంత కాలం పాజిటివ్ పాత్రలే పోషించారు. కానీ తొలిసారి క్రూరమైన నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రను ఎంచుకోవడం ఆమె కెరీర్‌లోనే అతిపెద్ద టర్నింగ్ పాయింట్ గా చెప్పొచ్చు. సాధారణంగా ఒకసారి స్టార్ ఇమేజ్ వచ్చిన తర్వాత హీరోయిన్లు విలన్ పాత్రలు చేయడానికి సాహసించరు. కానీ అనుష్క ఈ పాత పద్ధతిని బ్రేక్ చేస్తున్నారు. మాలీవుడ్‌లో ఆమె పోషించే నీల పాత్ర గనుక క్లిక్ అయితే తెలుగులోనూ హీరోయిన్ల పాత్రల చిత్రణలో భారీ మార్పులు వచ్చే అవకాశం లేకపోలేదు. కేవలం గ్లామర్ లేదా సాఫ్ట్ రోల్స్ మాత్రమే కాకుండా కథను మలుపు తిప్పే బలమైన ప్రతినాయిక పాత్రలు చేయడానికి టాలీవుడ్ అగ్ర తారలకు ఇది ఒక స్ఫూర్తిగా నిలుస్తుంది. అనుష్క తీసుకున్న ఈ నిర్ణయం టాలీవుడ్‌లో ఆమె తదుపరి సినిమాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఒక నటిగా తనలోని విలనిజాన్ని ఎంత ప్రభావవంతంగా పండించగలరో 'కథనార్' నిరూపిస్తే.. తెలుగులోని అగ్ర దర్శకులు ఆమె కోసం ప్రత్యేకంగా నెగటివ్ టచ్ ఉన్న లేడీ ఓరియంటెడ్ కథలను సిద్ధం చేసే అవకాశం ఉంది. 'బాహుబలి'లో దేవసేనగా అనుష్క ప్రదర్శించిన పగను ఆ పాత్రకే వన్నె తీసుకొచ్చింది. అదే పగ ఓ విలనీగా పండిస్తే అది వేరే లెవల్లో ఉంటుంది. ఆమె నటనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించినట్లే అవుతుంది. ప్రస్తుతం ఇండియన్ సినిమాలో విలన్ పాత్రలకు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. హీరోలకు సమానంగా విలన్లకు ప్రాధాన్యత లభిస్తోంది. అనుష్క వంటి స్టార్ నటి విలన్‌గా మారడం వల్ల టాలీవుడ్‌లో మల్టీస్టారర్ ట్రెండ్‌కు కొత్త అర్థం రావచ్చు. అంటే ఒక పెద్ద హీరో సినిమాలో అనుష్క విలన్‌గా నటిస్తే ఆ కాంబినేషన్ బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టిస్తుంది. ఇది తెలుగు సినిమాల మార్కెట్ పరిధిని పెంచుతుంది అనడంలో సందేహం లేదు. మాలీవుడ్ ఎప్పుడూ నటనకు ప్రాధాన్యత ఇచ్చే పరిశ్రమ. అక్కడ అనుష్క చేస్తున్న ఈ ప్రయోగం సక్సెస్ అయితే టాలీవుడ్ మేకర్స్ ఆమెను కేవలం 'జేజమ్మ' ఇమేజ్ లోనే చూడకుండా? ఎలాంటి పాత్ర అయినా పోషించగల కంప్లీట్ యాక్టర్ గా గుర్తిస్తారు. దీనివల్ల ఆమెకు సెకండ్ ఇన్నింగ్స్‌లో మరిన్ని వైవిధ్యమైన, ప్రయోగాత్మకమైన అవకాశాలు వెల్లువెత్తుతాయి. ఒక రకంగా చెప్పాలంటే నీల పాత్ర అనుష్క తన కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి చేస్తున్నట్లే. టాలీవుడ్ హీరోయిన్ల భవిష్యత్తుకు ఒక కొత్త మార్గదర్శకంగా నిలిచే అవకాశం ఉంది. టాలీవుడ్‌లో అనుష్క స్థానం మరింత సుస్థిరం అవుతుంది. హీరోయిన్ అంటే కేవలం కథానాయకుడి వెనుక ఉండే పాత్ర కాదు. కథను శాసించే విలనీ కూడా అవ్వొచ్చని నిరూపించే రోజులు దగ్గర పడినట్లే. అనుష్క చేస్తోన్న ఈ తెగింపు టాలీవుడ్ లో ఓ కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని చెప్పొచ్చు.

## రెండు సర్దార్‌లను మించి మూడో సర్దార్ !

కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ కెరీర్‌లో అత్యంత విజయవంతమైన చిత్రాల్లో 'సర్దార్' ఒకటి. గూఢచారి నేపథ్యంలో సాగే ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సాధించడమే కాక కార్తీ నటనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించిన చిత్రమది. ప్రస్తుతం ఈ సినిమాకు కొనసాగింపుగా 'సర్దార్ 2' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. మిత్రన్ దర్శకత్వం వహిస్తోన్న సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పటికే సినిమా రిలీజ్ కావాలి. కానీ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం కారణంగా విడుదల ఆలస్యమవుతుంది. ప్రస్తుతం కార్తీ హీరోగా తాజా చిత్రం 'మార్షల్' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా వివరాలు లీక్ అవుతున్నాయి. 'మార్షల్' కూడా స్పై చిత్రమేనని అంటున్నారు. 'సర్దార్' రెండు భాగాలను మించి మార్షల్ ఉండబోతోందని సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. ఈ సినిమా కాన్సెప్ట్ విన్నవారంతా? ఇది 'సర్దార్ ను మించిన ట్విస్ట్ లో కథ లో ఉన్నట్లు అభిప్రాయపడుతున్నారు. 'మార్షల్' గూఢచారి నేపథ్యంలోనే సాగుతున్నప్పటికీ? ఇందులో యాక్షన్ లెవెల్స్ మిషన్ తీవ్రత సన్నివేశాలు స్ట్రాంగ్ గా ఉంటాయంటున్నారు. 'సర్దార్' లో కార్తీ తండ్రి, కొడుకుగా రెండు భిన్నమైన పాత్రల్లో అలరించారు. కానీ 'మార్షల్' లో ఆయన పోషించే పాత్రలు అంతకు మించిన డెప్త్ కలిగి ఉంటాయని లీకులందుతున్నాయి. ముఖ్యంగా మార్షల్ ఆర్ట్స్ నేపథ్యంలో సాగే పోరాట సన్నివేశాలు హాలీవుడ్ స్థాయిలో ఉంటాయని అంటున్నారు. స్పై కాన్సెప్ట్ అంటే కొత్తగా ఏమీ ఉండదు. శత్రు దేశంపై మిషన్స్ నేపథ్యంలోనే సాగుతుంటాయి. అయితే ట్రీట్ మెంట్ అన్నది ముఖ్యం. ఈ సినిమా కాన్సెప్ట్ ప్రధానంగా దేశ రక్షణ కోసం సరిహద్దులు దాటి వెళ్లే ఒక రహస్య సైనికుడి ప్రయాణం చుట్టూ తిరుగుతుందిట. ఇందులో టెక్నాలజీ , ఇంటెలిజెన్స్ అంశాలను దర్శకుడు నలన్ కుమార స్వామి చాలా కొత్తగా ప్రజెంట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సర్దార్ లో కేవలం వాటర్ మాఫియా గురించి చెబితే? మార్షల్ లో అంతర్జాతీయ స్థాయిలో జరిగే ఒక భారీ కుట్రను ఛేదించే హీరోగా కార్తీ కనిపిస్తారని సమాచారం. ఈ క్రమంలో వచ్చే ట్విస్ట్‌లు ప్రేక్షకులను సీటు అంచున కూర్చోబెడతాయని యూనిట్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ సినిమా కోసం కార్తీ కూడా నాలుగింతలు ఎక్కువ శ్రమ పడుతున్నాడుట. 'సర్దార్' ను మించిన మేకోవర్ కార్తీ రోల్ లో హైలైట్ అవుతుందంటున్నారు. భారీ యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం విదేశీ స్టంట్ మాస్టర్ల పర్యవేక్షణలో కార్తీ



ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడుట. సంతోష్ నారాయణన్ సంగీతం ఈ స్పై థ్రిల్లర్‌కు ప్రధాన బలంగా నిలిచే అవకాశం ఉంది. మొత్తంగా కాన్సెప్ట్ పరంగా , మేకింగ్ పరంగా కార్తీ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిపోతుందని ట్రేడ్ విశ్లేష కులు అంచనా వేస్తున్నారు. త్వరలోనే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడి కానున్నాయి.

## సర్‌ప్రైజ్ ఇస్తామని చెప్పిన గంటల్లోనే ఇరాన్ సైనికాధికారి మృతి



ఇరాన్, మార్చి 20 : అమెరికా-ఇజ్రాయెల్‌తో జరుగుతోన్న యుద్ధంలో ఇరాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇజ్రాయెల్ దాడుల్లో కీలక సైనికాధికారి, ఐఆర్‌జీసీ ప్రతినిధి జనరల్ అలీ మహమ్మద్ నయినీ మృతి చెందారు. శత్రు దేశాన్ని హెచ్చరించిన కొన్ని గంటల్లోనే ఆయన చనిపోవడం గమనార్హం. ఈ మృతిని ఐఆర్‌జీసీ ధ్రువీకరించింది. నయినీ మరణించడానికి కొన్ని గంటల ముందు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. యురేనియం శుద్ధి చేయడం, బాలిస్టిక్ క్షిపణులు తయారుచేసే సామర్థ్యం ఇక ఇరాన్‌కు లేదని నెతన్యాహు అనగా.. "ఇజ్రాయెల్, అమెరికాతో యుద్ధం జరుగుతున్నప్పటికీ.. మా క్షిపణి పరిశ్రమ ఇప్పుడు అత్యున్నత స్థాయికి చేరుకుంది. ఈ ఘర్షణల్లో కూడా వేం ఉత్పత్తిని కొనసాగిస్తున్నాం. మావద్ద చాలినన్ని నిల్వలు ఉన్నాయి. ఈ విషయంలో మాకు ఎలాంటి ఆందోళనా లేదు. మా శత్రువుకు సర్‌ప్రైజ్‌లు ఎదురుకానున్నాయి. యుద్ధం కొనసాగేకొద్దీ అవి మరింత తీవ్రంకానున్నాయి" అంటూ నయినీ కౌంటర్ ఇచ్చారు. అలాగే ఇరాన్ నౌకాదళం ధ్వంసం అయిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను తోసిపుచ్చారు. పర్షియన్ గల్ఫ్‌లోకి అమెరికా తన నౌకలను పంపాలంటూ సవాలు విసిరారు. ఇలా ఆయన హెచ్చరించిన కొద్ది గంటల్లోనే ఇజ్రాయెల్ దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఈ వారంలో ఇప్పటికే ఇరాన్ అత్యున్నత సైనికాధికారి అలీ లారిజానీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ అనుబంధ బసీజ్ మిలీషియా అధిపతి జనరల్ గులాం రెజా సాల్మనీ మరణించిన సంగతి తెలిసిందే.

### అసమ్మతి అణచివేత.. ఇరాన్‌లో యువరెజ్లర్‌కు బహిరంగ ఉరి



ఇరాన్, మార్చి 20 :ఒకవైపు అమెరికా, ఇజ్రాయెల్‌తో పోరాడుతోన్న ఇరాన్ .. మరోవైపు అంతర్గత అసమ్మతిని కఠినంగా అణచివేస్తున్నట్లు కనిపిస్తోంది. కొన్నినెలల క్రితం ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనలతో సంబంధం ఉన్న ముగ్గురికి మరణశిక్ష అమలు చేసింది. కోమ్ నగరంలో ప్రజలందరి మధ్య బహిరంగా వారిని ఉరితీసింది. వారిలో ఒక రెజ్లర్ కూడా ఉన్నారని స్థానిక మీడియా, మానవ హక్కుల సంఘాలు వెల్లడించాయి. డిసెంబరు 2025లో మొదలైన నిరసనలు కొంతకాలంపాటు కొనసాగాయి. ఆ సమయంలో ఇద్దరు పోలీసుల హత్య ఘటనలో సాలేహ్ మహమ్మద్ (19ఏళ్ల రెజ్లర్), సయీద్ దావోది, మెహ్దీ ఘాసెమి ప్రమేయం ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఆ నిరసనల్లో భాగమైన వారిని ఉరితీయడం ఇదే తొలిసారని తెలుస్తోంది. ఇలా మరికొన్ని మరణశిక్షలు అమలు కావొచ్చని ఇరాన్ హ్యూమన్ రైట్స్ సంస్థ ఆందోళన వ్యక్తంచేసింది. తాజా ఘటనలో విచారణ పారదర్శకంగా జరగలేదని ఆరోపించింది.

## పశ్చిమాసియా ఉద్రిక్తతలు..

# ఎరువుల ఎగుమతులపై చైనా ఆంక్షలు

బీజింగ్, మార్చి 20 : ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇప్పటికే చమురు సరఫరా సమస్యలు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు ప్రపంచంలోని అతిపెద్ద ఎరువుల ఎగుమతిదారుల్లో ఒకటిగా ఉన్న చైనా యుద్ధ ప్రభావం వల్ల.. జెట్ ఇంధనం, డీజిల్, ఎరువుల ఎగుమతులపై పలు నిబంధనలు విధించడానికి చర్యలు తీసుకుంటోంది. దీంతో ప్రపంచ మార్కెట్‌లో యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఆందోళన నెలకొంది. అంతర్జాతీయ వాణిజ్య కేంద్రం డేటా ప్రకారం.. జెట్ ఇంధనం, డీజిల్, కిరోసిన్‌ల విదేశీ రవాణాను నిలిపివేయాలని చైనా జాతీయ అభివృద్ధి, సంస్కరణల కమిషన్ అక్కడి పరిశ్రమ వర్గాలకు ఆదేశాలు జారీ చేసింది. మార్చి మధ్య నుంచే నైట్రోజన్, పొటాషియం ఎరువుల మిశ్రమాలపై నిబంధనలు విధించింది. ఇప్పటికే



యూరియా ఎగుమతిని బ్యాన్ చేసిన బీజింగ్.. అమ్మోనియా సల్ఫేట్ ఎగుమతికి మాత్రం అనుమతినిచ్చింది. ఇంధన, ఆహార నిల్వలు పరిరక్షించుకోవడానికి, దేశీయ మార్కెట్‌ను కాపాడుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. అయితే భారత్‌కు ఎరువుల ఎగుమతిని నిలిపివేయాలని చైనాలోని షాన్‌డాంగ్ ప్రావిన్స్‌లోని ఓ ఎరువుల తయారీ సంస్థకు ప్రభుత్వ ఆదేశాలు వచ్చినట్లు అక్కడి ఉద్యోగులు వెల్లడించారు. బీజింగ్ నుంచి ఆస్ట్రేలియా, వియత్నాం, భారత్ సహా పలు దేశాలు ప్రస్తుతం ఎరువులను దిగుమతి చేసుకుంటున్నాయి. చైనా నుంచి ఎగుమతులు నిలిచిపోవడం వల్ల ప్రపంచ మార్కెట్‌లో యూరియా ధరలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల వ్యవసాయ ఆధారిత దేశాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. మరోవైపు యూరియా ఉత్పత్తికి అవసరమైన ద్రవరూప సహజ వాయువు ఎల్ఎన్‌జీ సరఫరా లేకపోవడంతో భారత్‌లోని పలు యూరియా కంపెనీలు ప్లాంట్లను మూసివేసే పరిస్థితులు నెలకొన్నట్లు ఇటీవల పలు సర్వేలు వెల్లడించాయి.


# తాగు నీటి సమస్యలు తలెత్తొద్దు: మంత్రి సీతక్క



హైదరాబాద్, మార్చి 20 (పోలీస్ నిఘా) : వేసవి కాలంలో తాగునీటి అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో మిషన్ భగీరథ పనితీరుపై మంత్రి సీతక్క సచివాలయంలో విస్తృతస్థాయి సమీక్ష నిర్వహించారు. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరా పరిస్థితి, నీటి నిల్వల స్థాయి, పంపిణీ వ్యవస్థపై సమగ్ర వివరాలను అధికారులు మంత్రి ముందు ఉంచారు. రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లు, సోర్స్ పాయింట్ల వద్ద తగిన నీటి నిల్వలు ఉన్నాయని, ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి కొరత తలెత్తే అవకాశాలు లేవని స్పష్టం చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని చేపట్టిన 'సమ్మర్ స్పెషల్ డ్రైవ' విజయవంతంగా పూర్తి చేశామని, అందువల్ల గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరా అంతరాయం లేకుండా కొనసాగుతోందని తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు గ్రామస్థాయిలో మిషన్ భగీరథ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని వివరించారు. ముఖ్యంగా సర్పంచులతో నేరుగా సంప్రదింపులు జరుపుతూ రోజువారీ తాగునీటి సరఫరా పరిస్థితిని తెలుసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 90 శాతం మంది సర్పంచులతో మాట్లాడి ఫీడ్‌బ్యాక్ సేకరించామని, వారందరూ తాగునీటి సరఫరాపై సంతృప్తి వ్యక్తం చేశారని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఎక్కడైనా పైపులైన్ మరమ్మతులు లేదా ఇతర పనులు చేయాల్సి వస్తే గ్రామస్తులకు ముందుగానే సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. అలాగే మిషన్ భగీరథ వ్యవస్థ ఇంకా అందుబాటులోకి రాని గ్రామాలు, ముఖ్యంగా మారుమూల ఆదివాసీ గూడాల్లో తాగునీటి కోసం బావులు తవ్వాలనే ప్రజల అభ్యర్థనలు వస్తున్నాయని మంత్రి తెలిపారు. అలాంటి ప్రాంతాల్లో ప్రజల అవసరాలను గుర్తించి తక్షణమే బోర్లు, బావులు తవ్వే ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## దేవుడి సాక్షిగా నేను రాసినవన్నీ నిజాలే...

### ఇప్పటికైనా చెల్లికి జగన్ న్యాయం చేస్తాడని ఆశిస్తున్నా: విజయమ్మ



హైదరాబాద్, మార్చి 20 (పోలీస్ నిఘా) : కుటుంబ ఆస్తుల పంపకాలపై నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో వివాదం కొనసాగుతున్న వేళ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ సతీమణి విజయమ్మ మీడియాకు అడ్వకేట్ నోటరీ విడుదల చేశారు. వైకాపా నేతలు చేస్తున్న ఆరోపణలపై అందులో పూర్తిస్థాయి స్పష్టత ఇచ్చారు. ఆస్తుల విషయంలో చెల్లెలు, ఆమె పిల్లలకు జగన్ అన్యాయం చేశారని అన్నారు. ఆస్తుల పంపకం ఎప్పుడూ జరగలేదని, వైఎస్ మరణించే వరకు ఉన్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులేనని ఆమె అన్నారు. " తన ఆస్తులన్నీ నలుగురు మనవలు, మనవరాళ్లకు సమానంగా పంచాలని వైఎస్ఆర్ ఉద్దేశం. ఇది ఆయన ఆదేశం కూడా. దగ్గర వాళ్లందరికీ తెలిసిన వాస్తవమిది. ఎంవోయూలో షర్మిలకు రాసిన ప్రతి ఆస్తి న్యాయంగా ఆమెకు దక్కాల్సిందే. షర్మిల హక్కుకు అనుగుణంగానే జగన్ ఎంవోయూ రాశాడు. వాస్తవానికి షర్మిలకు చెందాల్సిన దానికంటే తక్కువే రాశాడు. సరస్వతి సిమెంట్ సహా యెలహంక భూమి కూడా షర్మిలదే. షర్మిలకు ఇప్పటి వరకు ఇచ్చానని చెబుతున్న డబ్బంతా డివిడెండ్ మాత్రమే. ఆస్తుల విషయంలో జగన్ తన మేనల్లుడు, మేనకోడలికి ఇప్పటివరకు అన్యాయం చేశాడు. ఇప్పటికైనా న్యాయం చేస్తాడని తల్లిగా ఆశిస్తున్నాను. నిజం ఏమిటో దేవుడికి, నా కొడుక్కి కూడా తెలుసు. దేవుడి సాక్షిగా నేను రాసినవన్నీ వాస్తవాలు మాత్రమే" అని ఆమె పేర్కొన్నారు.

## ప్రీమియం పెట్రోల్ ధర రూ.2 పెంపు



న్యూఢిల్లీ, మార్చి 20 : ప్రీమియం పెట్రోల్ ధర లీటర్‌కు రూ.2.35 పెరిగింది. దేశవ్యాప్తంగా వీటి ధరలను పెంచినట్లు హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ప్రకటించింది. సాధారణ పెట్రోల్ ధరలు యథాతథంగా ఉన్నాయి. అలాగే, బీపీసీఎల్ స్పీడ్, ఐవోసీఎల్ ఎక్స్‌పీ95 ప్రీమియం పెట్రోల్ ధరలకు కూడా ఈ పెంపు వర్తిస్తుంది. ప్రాంతాన్ని బట్టి లీటరుకు రూ.2.09 నుంచి రూ.2.35 వరకూ పెట్రోలియం సంస్థలు ప్రీమియం పెట్రోల్ ధరను పెంచాయి. సవరించిన ధరలు శుక్రవారం నుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ప్రపంచ ఇంధన మార్కెట్లపై ప్రభావం పడుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## యూనియన్ మినిస్టర్ జయంత్ చౌదరి కి బెదిరింపు కాల్స్



న్యూఢిల్లీ, మార్చి 20 : యూనియన్ మంత్రి, ఆర్ఎల్‌డీ అధినేత జయంత్ చౌదరిని చంపుతామంటూ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన బెదింపు కాల్ ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. మంత్రి వ్యక్తిగత సహాయకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మార్చి 18 ఉదయం ఫోన్ కాల్ ద్వారా ఈ బెదిరింపు వచ్చినట్లు తెలిసింది. గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మంత్రిని హత్య చేస్తామని హెచ్చరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే, మంత్రిపై ముందుగా నిఘా లేదా గూఢచర్యం జరిగి ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఈ అంశాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనపై స్పందించిన పోలీసు వర్గాలు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు. బెదిరింపు కాల్ ఎక్కడి నుంచి వచ్చిందో గుర్తించేందుకు సాంకేతిక ఆధారాలతో విచారణ కొనసాగుతోందని వెల్లడించారు.

# ఘర్షణలు ఇలాగే కొనసాగితే చమురు 180 డాలర్లకు: సౌదీ

న్యూఢిల్లీ, మార్చి 20 : పశ్చిమాసియా ఘర్షణల్లో ఇంధన క్షేత్రాలు టార్గెట్ అవుతున్నాయి. హర్మూజ్ జలసంధిలో అంతరాయాలతో ఇప్పటికే నెలకొన్న చమురు భయాలకు ఈ దాడులు ఆజ్యం పోస్తున్నాయి. జలసంధిలో నౌకల రాకపోకలను ఏప్రిల్ తర్వాత కూడా ఇలానే అడ్డుకుంటే.. చమురు ధర ఒక బ్యారెల్ 180 డాలర్ల వరకు పెరగొచ్చని సౌదీ అరేబియా అంచనా వేస్తోంది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఫిబ్రవరి 28న ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య యుద్ధం మొదలైన సంగతి తెలిసిందే. యుద్ధానికి ముందు బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్‌కు 70 డాలర్లుగా ఉంది. తాజాగా ఒక దశలో అది 119 డాలర్లకు చేరుకుంది. ఈ పరిణామాలపై సౌదీ విదేశీ వ్యవహారాల నిపుణుడు ఉమర్ కరీం మాట్లాడుతూ.."ఎర్ర సముద్రంలోని టెర్మినళ్లపై




దాడి జరిగితే.. రవాణాకు అడ్డంకి ఏర్పడితే.. ముడిచమురు ధర 150 డాలర్లకు పెరగడం అసాధ్యమేమీ కాకపోవచ్చు" అని పేర్కొన్నారు. హర్మూజ్ ఎఫెక్ట్‌తో గల్ఫ్ దేశాలు కొత్త మార్గాలపై దృష్టిపెడుతోన్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో సౌదీ అరేబియా (రాజీబీటతి ఒతీజీఎతిజీ) ఎర్ర సముద్రం మీదుగా చమురు ఎగుమతులను పెంచింది. అక్కడి యాన్బు పోర్టు సమీపంలోని అరామ్‌కో రిఫైనరీపై డ్రోన్ దాడి చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే హర్మూజ్ అంతరాయాలు కొనసాగుతుండగా.. ఎర్రసముద్రం టెర్మినళ్ల పైనా దాడులు కొనసాగితే సంక్షోభం మరింత ముదరొచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

**గ్యాస్ ధరలపై భారీ ఎఫెక్ట్..**

ఖతార్‌లో ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ క్షేత్రం రస్ లఫాన్‌పై ఇరాన్ దాడి చేసిన సంగతి తెలిసిందే. దీని మరమ్మతులకు సుదీర్ఘ సమయం పట్టే అవకాశం ఉందని పారిస్‌లోని గ్లోబల్ ఎనర్జీ పాలసీ కేంద్ర పరిశోధకురాలు అన్నె సోఫీ అంచనా వేశారు.

"నష్ట ప్రభావం ఏ స్థాయిలో ఉందో ఇంకా మనకు తెలియదు. కానీ ఇతర ఎల్ఎన్‌జీ కేంద్రాల్లో గతంలో జరిగిన ఘటనలను బట్టి చూస్తే.. దానిని సాధారణస్థితికి తీసుకురావడానికి నెలల సమయం పట్టొచ్చు. దీంతో గ్యాస్ ధరలపై ప్రభావం భారీగా ఉండొచ్చు" అని పేర్కొన్నారు.

# తెలంగాణ బడ్జెట్‌లో ఓయూకు పెద్దపీట

## రూ. 1,000 కోట్లు కేటాయింపు



హైదరాబాద్, మార్చి 20 (పోలీస్ నిఘా) : తెలంగాణ విద్యార్థి ఉద్యమాలకు గుండె కాయ ఉస్మానియా యూనివర్సిటీకి రాష్ట్ర బడ్జెట్‌లో పెద్ద పీట వేశారు. వర్సిటీ అభివృద్ధికి రూ. 1000 కోట్లు కేటాయించారు. ఈ మేరకు అసెంబ్లీలో డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. ఓయూ కేంద్రంగా తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిరిపడిన విషయం తెలిసిందే. అయితే గత ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి తొలి నుంచి కూడా ఓయూ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఓయూకు సైతం ఆయన వెళ్లారు. విద్యార్థులతో భేటీ అయ్యారు. వారి సమస్యలను పరిష్కరించారు. నిరుద్యోగ సమస్యకు కూడా నోటిఫికేషన్ల ద్వారా పరిష్కరించారు. తాజాగా యూనివర్సిటీ అభివృద్ధిపై ఫోకస్ పెట్టిన ఆయన బడ్జెట్‌లో రూ. 1000 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. ఈ మేరకు బడ్జెట్‌లో వర్సిటీకి కేటాయింపులు జరిపారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లు చేశారని పలువురు కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ఓయూని తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపేందుకే భారీగా నిధులను మంజూరు చేసిందని చెబుతున్నారు. కాగా బడ్జెట్‌లో కేటాయించిన రూ. 1,000 కోట్లను వర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పన, పాత భవనాల పునరుద్ధరణ, నూతన హాస్టల్ భవనాల నిర్మాణానికి వినియోగించనున్నారు. ఈ కేటాయింపులతో యూనివర్సిటీలో అత్యాధునిక పరిశోధనా కేంద్రాలు (ఖీవబవజీతీఇ్ఛ్ర ఒజీఎబ), డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్ క్లాస్ రూమ్‌ల ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. ఇక విద్యార్థులకు అవసరమైన క్రీడా ప్రాంగణాలు, క్యాంపస్ సుందరీకరణ పనులకు కూడా ఈ నిధులు వెచ్చించనున్నారు. ప్రభుత్వ తీసుకున్న ఈ నిర్ణయంపై విద్యార్థులు, అధ్యాపకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## హైదరాబాద్ లోయర్ ట్యాంక్ బండ్ వద్ద కొత్తగా డా.బి.ఆర్ అంబేద్కర్ నాలెడ్జ్ టవర్




హైదరాబాద్, మార్చి 20 (పోలీస్ నిఘా) : హైదరాబాద్ లోయర్ ట్యాంక్ బండ్ వద్ద కొత్తగా డా.బి.ఆర్ అంబేద్కర్ నాలెడ్జ్ టవర్‌ను నిర్మించబోతున్నట్లు ప్రభుత్వ ప్రకటించిది. బడ్జెట్ స్పీచ్‌లో భట్టి విక్రమార్క ఈ విషయాన్ని స్పష్టం చేశారు. రూ.368 కోట్ల27 లక్షల అంచనా వ్యయంతో 910 ఎస్సీ కమ్యూనిటీ హాళ్లు/అంబేద్కర్ భవనాలు/విగ్రహాలు మంజూరు చేశామని తెలిపారు. అలాగే నింబోలి అడ్డ కాచిగూడలో బాబూ జగ్జీవన్ రామ్ పేరుతో నూతన వసతి గృహాన్ని నిర్మిస్తారమని పేర్కొన్నారు. అంతరాలు లేని సమాజం కోసం మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సామాజిక న్యాయం చేయాలనేది మా ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అన్నారు. వసతి పాఠశాలలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

**ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలుపై..**

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఇవాళ శాసనసభలో 2026-27 వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన ప్రసంగంలో కీలక ప్రకటన చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేయడానికి మా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అన్నారు. మేము అధికారంలోకి వచ్చే సమయంలో 2023-24 ఆర్థిక సంవత్సరం నాటికి సబ్ ప్లాన్ చట్ట ప్రకారం ఖర్చు చేయాల్సిన నిధులలో ఎస్సీలకు చెందిన రూ.13,617 కోట్లు, ఎస్టీలకు చెందిన 1,317 కోట్లు కలిసి మొత్తం 14,934 కోట్లు ఖర్చు కాకుండా ఉందన్నారు. మా ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరంలో చేసిన కేటాయింపులతో పాటు ఈ బకాయిలను కూడా అదనంగా కేటాయించామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఈ క్యారీ ఫార్వర్డ్ చేయవలసిన నిధులు, ఎస్సీలకు రూ7,757 కోట్లు, ఎస్టీలకు రూ.1,754 కోట్లు ఖర్చు చేయవలసి ఉంది. వాటిని మేము 2026-27 ఆర్థిక సంవత్సరంలో కేటాయించాల్సిన మొత్తానికి అదనంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి చెందిన బకాయిలను కూడా కేటాయిస్తున్నామన్నారు.

## ఐటీకి రూ.875 కోట్లు..

# గ్రామాలకు హై-స్పీడ్ ఇంటర్‌నెట్



హైదరాబాద్, మార్చి 20 (పోలీస్ నిఘా) : తెలంగాణ వార్షిక బడ్జెట్‌లో ప్రభుత్వం ఐటీ శాఖకు భారీగా నిధులు కేటాయించింది. గ్రామీణ ప్రాంతాలకు ఇంటర్నెట్ సేవలు అందించాలన్న లక్ష్యంతో ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.875 కోట్లను కేటాయించింది. ఇప్పటికే టీ-ఫైబర్ ద్వారా రాష్ట్రంలోని 424 మండలాల్లోని 8888 గ్రామపంచాయతీలకు, 4800 ప్రభుత్వ సంస్థలకు హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అనుసంధానం చేసింది. ఈ ఆర్థిక సంవత్సంలో మరో 50 వేల ప్రభుత్వ సంస్థలకు కొత్త కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రైవేట్ సంస్థల ఇంటర్నెట్‌ను సేవలను తగ్గించడంతోపాటు ఖర్చును తగ్గించేందుకు ప్రభుత్వం టీ-ఫైబర్ ద్వారా సురక్షితమైన హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందిస్తున్నట్లు ఆర్థికశాఖ మంత్రి భట్టి బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు.

ఐటీలో 9.39 లక్షల మందికి ఉద్యోగాలు: ఐటీ రంగంలో తెలంగాణ సాధిస్తున్న అభివృద్ధి దేశానికే తలమానిరంగా మారిందని భట్టి తెలిపారు. రాష్ట్రంలో 1500 కంటే ఎక్కువ ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలు ఉన్నాయన్నారు. తెలంగాణలో ఐటీ రంగంలో వృద్ధి పెంచడానికి, పెట్టబడులను ఆకర్షించడానికి, ఉపాధి కల్పన కోసం 1వ, 2, ఐసీటీ విధానాలను ప్రభుత్వం ప్రారంభించిందని మినిస్టర్ భట్టి వెల్లడించారు. వీటితోపాటు ఎలక్ట్రానిక్స్ పాలసీ, ఇమేజ్ పాలసీలను ప్రభుత్వం తీసుకొస్తున్న చెప్పారు. తెలంగాణ నుంచి ఐటీ ఎగుమతులు 3.13 లక్షల కోట్లకు 9.39 లక్షల మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని భట్టి వివరించారు.

జీసీసీలో హైదరాబాద్ వాటా 20 శాతం: మొత్తం భారతదేశం గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లలో 20 శాతం హైదరాబాద్‌లోనే ఉన్నాయని భట్టి విక్రమార్క వెల్లడించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 70కి పైగా కొత్త ఉఅఅలు హైదరాబాద్2లో ఏర్పడ్డాయన్నారు. ప్రపంచ దిగ్గజ టెక్ దిగ్గజం గూగుల్ కంపెనీలో హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటన్‌ను ఏర్పాడు చేసినట్టు తెలిపారు. హైదరాబాద్ పశ్చిమ ప్రాంతానికి పరిమితం కాకుండా నగరం చుట్టూ ఐటీని విస్తరించడానికి 'గ్రిడ్' విధానాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని భట్టి చెప్పారు.

## హైదరాబాద్ మెట్రోసేవలకు కాసేపు అంతరాయం

హైదరాబాద్, మార్చి 20 (పోలీస్ నిఘా) : నాగోల్-రాయదుర్గం మార్గంలో మెట్రో సేవలకు అంతరాయం ఏర్పడింది. సాంకేతిక సమస్యతో మెట్రో సర్వీసులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. దాదాపు 20 నిమిషాల పాటు సేవలు నిలిచిపోయాయి. మరమ్మతుల అనంతరం మెట్రో సర్వీసులు కొనసాగుతున్నాయి.

Printed, Published & Owned by Kemoju Madhuri, Plot No.32, 3rd Floor, R.K.Nagar, Attapur, Rajendra Nagar, R.R.Dist., Telangana State, Pin Code:500043, Printed at S.V.Printers, Plot No.32,Ground Floor, R.K.Nagar, Attapur, Rajendra Nagar, R.R.Dist., Telangana State, Pin Code: 500043, Editor : Kemoju Srinivas, RNI No.TELTEL/2016/68720, e-mail: policenigah@gmail.com. Cell: 9133613813, Off: 040-35668279